11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
ప్రకటన కర్తలకు, పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు


సంపుటి : 1 సంచిక : 47 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : నరసరావుపేట శుక్రవారం 24 అక్టోబర్ 2025 వెల : 5/-రూ ॥


VOLUME :1 ISSUE : 47 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : NARASARAO PETA FRI 24 OCTOBER 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Narasarao Peta,Bapatla,Ongole,Visakhapatnam,Kakinada,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## టెక్ హబ్‌గా ఏపీ, ఇంధన రంగంలో అపార అవకాశాలు...

- అబుదాబిలో రెండో రోజు పర్యటిస్తున్న సీఎం చంద్రబాబు
- ఇంధన, టెక్నాలజీ రంగాలపై ప్రధానంగా దృష్టి
- ఏడీఎన్ఓసీ, జీ42 సంస్థల ప్రతినిధులతో కీలక భేటీలు
- ఏపీని టెక్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దుతామని వెల్లడి
- రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం
- విశాఖ భాగస్వామ్య సదస్సుకు రావాలని పిలుపు





**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులకు స్వర్గధామంగా మార్చే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు తన యూఏఈ పర్యటనను వేగవంతం చేశారు. పర్యటనలో భాగంగా రెండో రోజైన గురువారం, అబుదాబిలో ఇంధన, టెక్నాలజీ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులతో ఆయన సమావేశమయ్యారు. రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ భేటీలు జరిగాయి. ముఖ్యంగా, అబుదాబి నేషనల్ ఆయిల్ కంపెనీ (ఏడీఎన్ఓసీ) ప్రతినిధులతో కీలక సమావేశం నిర్వహించారు. దక్షిణాసియాకు చేరువగా సుదీర్ఘ సముద్ర తీర ప్రాంతం కలిగిన ఆంధ్రప్రదేశ్... ఇంధన రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు అత్యంత అనుకూలమని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ రంగంలో పెట్టుబడులకు ఏపీలో విస్తృతంగా అవకాశాలు ఉన్నాయని అబుదాబి నేషనల్ ఆయిల్ కంపెనీ ప్రతినిధులకు వివరించారు.
యూఏఈ పర్యటనలో భాగంగా రెండో రోజు గురువారం అబుదాబీలో అల్ మైరాహ్ ఐలాండ్‌లోని ఏడీజీఏ స్క్వేర్‌లో ఏడీఎన్ఓసీ గ్లోబల్ ట్రేడింగ్ ప్రతినిధి అహ్మద్ బిన్ తలిత్‌తో ముఖ్యమంత్రి సమావేశం అయ్యారు. ఈ భేటీలో పెట్రోకెమికల్, ఇంధన, ఎల్ఎన్‌జీ, గ్యాస్ ప్రాసెసింగ్, పోర్ట్ లాజిస్టిక్స్, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో అవకాశాలు గురించి చర్చించారు. కృష్ణపట్నం, మచిలీపట్నం, రామాయపట్నం, కాకినాడ వంటి పోర్టుల సమీపంలో పెట్రో కెమికల్, ఎనర్జీ రంగాల పెట్టుబడులకు అనువుగా ఉంటాయని సీఎం అన్నారు. ఏడీఎన్ఓసీ – ఆంధ్రప్రదేశ్ మధ్య సాంకేతిక సహకారం పైనా స్పష్టమైన రోడ్‌మ్యాప్ సిద్ధం చేయాలని భేటీలో ఇరువురు నిర్ణయించారు.

**అబుదాబీ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్‌తోనూ భేటీ**

అబుదాబీ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ అహ్మద్ జాసిమ్ అల్ జాబీతో, జీ 42 సీఈఓ మాన్సూర్ అల్ మాన్సూరీతోనూ ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా ఏపీ పయనిస్తోందని, రాజధాని అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ సేవలు జనవరి నుంచి అందుబాటులోకి వస్తున్నాయని సీఎం తెలిపారు. కొత్త అవకాశాలకు, ఇన్నోవేషన్‌కు అమరావతి కేంద్రంగా ఉంటుందన్నారు.
విశాఖలో నవంబర్ 14, 15 తేదీల్లో జరిగే భాగస్వామ్య సదస్సుకు రావాలని ఈ సందర్భంగా వారిని సీఎం ఆహ్వానించారు. కృత్రిమ మేధస్సు, క్లౌడ్ కంప్యూటింగ్, హెల్త్‌టెక్ రంగాల్లో నూతన ఆవిష్కరణలపై

వివరాలు 2లో..

## ఏపీ ఆరోగ్య విద్యలో కొత్త శకం..

### టాస్మానియా వర్సిటీతో మంత్రి లోకేశ్ కీలక చర్చలు

- ఫార్మసీ, పారామెడికల్ కోర్సుల అభివృద్ధికి టాస్మానియా వర్సిటీతో చర్చలు
- గ్రామీణ ఆరోగ్యం, తాగునీటిపై ఉమ్మడి పరిశోధనలకు ప్రతిపాదన
- ఏపీ విద్యార్థులకు ఆస్ట్రేలియాలో ప్లేస్‌మెంట్ కోసం ప్రత్యేక స్కిల్ ప్రోగ్రామ్స్
- విశాఖలో గ్లోబల్ సెంటర్ ఏర్పాటు చేయాలని బుపా సంస్థకు లోకేశ్ ఆహ్వానం
- రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన బుపా యాజమాన్యం



**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్‌లో ఫార్మసీ, పారామెడికల్ విద్యారంగాలను అంతర్జాతీ య ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్

వివరాలు 2లో..

## బీహార్ సీఎం అభ్యర్థిగా తేజస్వి యాదవ్



- బీహార్ మహాకూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిగా తేజస్వి యాదవ్
- సీట్ల పంపకాలపై ఆర్జేడీ, కాంగ్రెస్ మధ్య వీడిన ప్రతిష్టంభన
- రాజస్థాన్ మాజీ సీఎం అశోక్ గెహ్లాట్ అధికారిక ప్రకటన
- కూటమిలో ఆర్జేడీకి 143 అసెంబ్లీ స్థానాలు ఖరారు
- డిప్యూటీ సీఎం అభ్యర్థిగా ముఖేశ్ సహానీ పేరు ప్రకటన
- కాంగ్రెస్ అధిష్టానం జోక్యంతో వివాదానికి తెర

వివరాలు 2లో..

## పుతిన్‌తో చర్చలు బాగుంటాయి... కానీ, ఫలితం మాత్రం ఉండదు

### డొనాల్డ్ ట్రంప్ అసహనం



- రష్యాకు చెందిన రెండు అతిపెద్ద ఆయిల్ కంపెనీలపై అమెరికా కొత్త ఆంక్షలు
- శాంతి చర్చల్లో పురోగతి లేకపోవడమే ప్రధాన కారణం
- రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో జరగాల్సిన భేటీని రద్దు చేసుకున్న ట్రంప్

**పెన్ పవర్ డెస్క్:**ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని ముగించేందుకు శాంతి చర్చల విషయంలో ముందుకురాని రష్యాపై అమెరికా తన వైఖరిని కఠినతరం చేసింది.
రష్యా

వివరాలు 2లో..

## కలకలం రేపుతున్న తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి వాట్సాప్ స్టేటస్

- తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి, ఎంపీ కేశినేని చిన్ని మధ్య భగ్గుమన్న విభేదాలు
- టికెట్ కోసం చిన్ని అనుచరులకు డబ్బులిచ్చానంటూ కొలికపూడి సంచలన ఆరోపణ
- బ్యాంకు స్టేట్‌మెంట్‌ను వాట్సాప్ స్టేటస్‌గా పెట్టిన ఎమ్మెల్యే
- వివాదంపై దృష్టి సారించిన టీడీపీ అధిష్ఠానం
- ఇద్దరు నేతలను మంగళగిరికి పిలిచిన పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు
- నేడు తేలనున్న కొలికపూడి-చిన్ని వివాదం

వివరాలు 2లో..



## పాకిస్థాన్‌లో హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై రగడ... ఎందుకీ వ్యతిరేకత?

- గర్భాశయ క్యాన్సర్ నివారణకు పాకిస్థాన్‌లో భారీ వ్యాక్సినేషన్ కార్యక్రమం
- 9 నుంచి 14 ఏళ్లలోపు బాలికలకు హెచ్‌పీవీ టీకా పంపిణీ
- వ్యాక్సిన్‌పై సోషల్ మీడియాలో తీవ్రంగా వ్యాపించిన అపోహలు, వదంతులు
- ప్రజల్లో నమ్మకం కలిగించేందుకు కూతురికి టీకా వేయించిన ఆరోగ్య మంత్రి
- మంత్రి చర్యతో తగ్గిన వ్యతిరేకత, పెరిగిన టీకాల పంపిణీ

వివరాలు 2లో..




## జగన్ సంబంధం లేని విషయాల్లో క్రెడిట్ కొట్టేసే ప్రయత్నం చేస్తున్నారు

- జగన్ ప్రెస్ మీట్ లో చేసిన వ్యాఖ్యలపై సోమిరెడ్డి ఘాటు విమర్శలు
- గూగుల్ తెచ్చానని క్రెడిట్ కొట్టేస్తున్నారని ఆరోపణ
- నకిలీ మద్యం వ్యవహారంలో జగన్‌దే కీలక పాత్ర అని ఆరోపణ
- మద్యం బాటిళ్ల క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాలని సవాల్
- రుషికొండ ప్యాలెస్ కట్టుకుని భోగాపురంపై మాట్లాడతారా అని ప్రశ్న

వివరాలు 2లో..



## పలు దేశాల్లో ప్రభుత్వాలను కూల్చేస్తున్న జెన్ జీ...

### ఇండియాలో ఎందుకు మౌనంగా ఉంది?



- నేపాల్, బంగ్లాదేశ్‌లలో ప్రభుత్వాలను కూల్చేసిన యువత
- భారత్‌లో మాత్రం మౌనంగానే ఉంటున్న 37 కోట్ల మంది జెన్ జీ యువత
- 'దేశద్రోహి' ముద్ర, ఉద్యోగాల భయాలే ప్రధాన కారణాలు
- కులం, ప్రాంతం, భాషల వారీగా విడిపోయిన యువత
- భారత్‌లో భారీ యువ ఆందోళనలు కష్టమంటున్న నిపుణులు

వివరాలు 2లో..

## వర్ష ప్రభావిత జిల్లాలకు నిధుల విడుదల...

### దుబాయ్ నుంచి సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు

- దుబాయ్ పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు
- అక్కడి నుంచే భారీ వర్షాలపై సమీక్ష
- నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాలకు రూ. 2 కోట్ల చొప్పున నిధులు
- మిగతా జిల్లాలకు కోటి రూపాయల చొప్పున కేటాయింపు
- తక్షణమే విడుదల చేయాలని అధికారులకు ఆదేశం
- మంత్రులు, సీఎస్, కలెక్టర్లతో సీఎం టెలీకాన్ఫరెన్స్

వివరాలు 2లో..



## హైదరాబాద్‌ను ముంచెత్తిన వాన... స్తంభించిన జనజీవనం



- హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఉరుములతో కూడిన భారీ వర్షం
- రోడ్లన్నీ జలమయం కావడంతో ట్రాఫిక్ జామ్
- కూకట్‌పల్లి, అమీర్‌పేట్, జూబ్లీహిల్స్‌లో కుండపోత వాన
- మరో గంటలో మరిన్ని ప్రాంతాలకు వర్ష సూచన జారీ
- అవసరమైతేనే బయటకు రావాలని ప్రజలకు పోలీసుల సూచన

వివరాలు 2లో..

## బాలకృష్ణపై జగన్ సంచలన ఆరోపణలు.. అసెంబ్లీకి తాగి వచ్చారంటూ ఫైర్!

- అసెంబ్లీలో బాలయ్య వ్యాఖ్యలపై స్పందించిన జగన్
- బాలకృష్ణ తాగి మాట్లాడారంటూ సంచలన ఆరోపణలు
- ఆయన మానసిక ఆరోగ్యంపై అనుమానాలున్నాయని వ్యాఖ్య
- తాగి మాట్లాడే వ్యక్తిని ఎలా అనుమతిస్తారని ప్రశ్న
- అనుమతించిన స్పీకర్‌కు బుద్ధి లేదంటూ తీవ్ర విమర్శలు



**పెన్ పవర్ డెస్క్:**మెగాస్టార్ చిరంజీవిపై ఏపీ అసెంబ్లీలో టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చేసిన వ్యాఖ్యల దుమారం కొనసాగుతోంది. ఈ వ్యవహారంపై వైసీపీ అధినేత జగన్ ఘాటుగా స్పందించారు. బాలకృష్ణ అసెంబ్లీకి మద్యం సేవించి వచ్చారని, ఆయన మానసిక స్థితి సరిగా లేదని సంచలన ఆరోపణలు చేశారు. బాలకృష్ణ వ్యాఖ్యలు, పవన్ కల్యాణ్ మౌనంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు బదులిస్తూ జగన్ తీవ్ర స్థాయిలో

వివరాలు 2లో..




# ఏపీ ఆరోగ్య విద్యలో కొత్త శకం..

- మొదటి పేజి తరువాయి

తన ఆస్ట్రేలియా పర్యటనలో కీలక అడుగులు వేశారు. మెల్‌బోర్న్‌లో ప్రపంచ ప్రసిద్ధి గాంచిన యూనివర్సిటీ ఆఫ్ టాస్మానియా ( ప్రతినిధులతో ఆయన సమావేశమై, రాష్ట్ర విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలపై చర్చించారు. ఏపీలో నైపుణ్యాభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా ఈ పర్యటన సాగుతోంది. టాస్మానియా యూనివర్సిటీని సందర్శించిన మంత్రి లోకేశ్ కు, యూనివర్సిటీ డిప్యూటీ వైస్ ఛాన్సలర్ (అకడమిక్) ప్రొఫెసర్ నటాలీ బ్రౌన్, ఫార్మసీ విభాగ అధిపతి ప్రొఫెసర్ గ్లెన్ జాకబ్సన్ సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో ఫార్మసీ, పారామెడికల్ కోర్సుల పాఠ్య ప్రణాళికలను ప్రపంచస్థాయికి అనుగుణంగా అభివృద్ధి చేసేందుకు సహకరించాలని కోరారు. ముఖ్యంగా ఆస్ట్రేలియాలో అమలు చేస్తున్న కఠినమైన అక్రిడిటేషన్ వ్యవస్థల తరహాలో ఏపీలో కూడా కరికులం రూపకల్పన చేయాలని విజ్ఞప్తి చేశారు. శిక్షణలో భాగంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), టెలిమెడిసిన్ వంటి ఆధునిక డిజిటల్ హెల్త్ టూల్స్‌ను అనుసంధానించాలని సూచించారు. ఏపీలోని వైద్య కళాశాలలు, స్కిల్ యూనివర్సిటీకి టాస్మానియా వర్సిటీకి ఉన్న ఫార్మా, హెల్త్‌కేర్ నెట్‌వర్క్‌ను పరిచయం చేసి, పరిశ్రమలతో భాగస్వామ్యాలు కుదిరేలా చూడాలని కోరారు.

అంతేకాకుండా, ఏపీలోని గిరిజన ప్రాంతాలు, టాస్మానియాలోని మారుమూల కమ్యూనిటీలను దృష్టిలో ఉంచుకుని గ్రామీణ ఆరోగ్య సంరక్షణ, స్వచ్ఛమైన తాగునీటి సరఫరా వంటి అంశాలపై ఉమ్మడి పరిశోధనలు చేపట్టాలని లోకేశ్ ప్రతిపాదించారు. ఏపీలోని నర్సింగ్, ఫార్మసీ విద్యార్థులు, అధ్యాపకుల కోసం స్టూడెంట్, ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్ కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఆస్ట్రేలియాలోని ఉద్యోగ అర్హతలకు అనుగుణంగా ఏపీ విద్యార్థులకు ప్రత్యేక స్కిల్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్‌లు అందించాలని, తద్వారా వారి ప్లేస్‌మెంట్ అవకాశాలు మెరుగుపడతాయని వివరించారు. ఈ ప్రతిపాదనలపై ప్రొఫెసర్ నటాలీ బ్రౌన్ సానుకూలంగా స్పందించారు. ప్రపంచంలోని టాప్ 2 శాతం యూనివర్సిటీలలో తమది ఒకటని, ఇప్పటికే తమ వర్సిటీలో 1,500 మందికి పైగా భారతీయ విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. ఐఐటీలతో కలిసి రెన్యువబుల్ ఎనర్జీ వంటి ప్రాజెక్టులపై పనిచేస్తున్నామని, కేరళ వంటి రాష్ట్రాలతో నర్సింగ్ విద్యకు సంబంధించి ఒప్పందాలు ఉన్నాయని గుర్తుచేశారు. లోకేశ్ ప్రతిపాదనలను పరిశీలించి, ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు.

**విశాఖలో గ్లోబల్ సెంటర్‌కు బుపాకు ఆహ్వానం**

పర్యటనలో భాగంగా మంత్రి లోకేశ్, బ్రిటీష్ బహుళజాతి ఆరోగ్య సంరక్షణ, బీమా సంస్థ అయిన బుపా ఆసియా పసిఫిక్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీఓఓ) బిజల్ సెజ్ పాల్‌తో కూడా సమావేశమయ్యారు. ఐటీ, డేటా సెంటర్ రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖపట్నంలో బుపా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని లోకేశ్ కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ ఆరోగ్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని ఆహ్వానించారు. దీనిపై స్పందించిన బిజల్ సెజ్ పాల్, తమ సంస్థ 190 దేశాల్లో 38 మిలియన్ల వినియోగదారులతో పనిచేస్తోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలను తమ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## ఎడిటర్ వ్యూ

## కలకలం రేపుతున్న తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి వాట్సాప్ స్టేటస్

అధికార తెలుగుదేశం పార్టీలో ఓ కొత్త వివాదం కలకలం రేపుతోంది. విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని (శివనాథ్), తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మధ్య ఉన్న విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఎన్నికల టికెట్ కోసం ఎంపీ అనుచరులకు తాను డబ్బులు ఇచ్చినట్లు ఎమ్మెల్యే కొలికపూడి స్వయంగా ఆరోపించడం, అందుకు సంబంధించిన బ్యాంకు స్టేట్‌మెంట్‌ను తన వాట్సాప్ స్టేటస్‌గా పెట్టడం తీవ్ర చర్చనీయాంశమైంది. టీడీపీ టికెట్ కోసం కేశినేని చిన్ని రూ. 5 కోట్లు అడిగారని కొలికపూడి ఆరోపించారు. ఎమ్మెల్యే టికెట్ కోసం డబ్బు ఇచ్చానంటూ, ఆ మేరకు బ్యాంక్ స్టేట్ మెంట్ ను తన వాట్సాప్ స్టేటస్ గా పెట్టారు. అయితే ఈ వివాదంపై టీడీపీ అధినాయకత్వం దృష్టి సారించింది. రేపు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో దీనిపై పంచాయితీ చేయనున్నారు. రేపు పార్టీ కార్యాలయానికి రావాలంటూ ఎమ్మెల్యే కొలికపూడిని, ఎంపీ చిన్నిని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పిలిచారు. పల్లా ఇద్దరితో చర్చించిన అనంతరం, ఈ వివాదాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి తగిన నిర్ణయం తీసుకోనున్నారు.

## పుతిన్‌తో చర్చలు బాగుంటాయి... కానీ, ఫలితం మాత్రం ఉండదు

- మొదటి పేజి తరువాయి

ఆర్థిక వ్యవస్థకు జీవనాధా రమైన రెండు అతిపెద్ద చమురు కంపెనీలపై కొత్త ఆంక్షలను విధిస్తున్నట్లు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ప్రకటించింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌పై ఒత్తిడి పెంచి, ఆయన్ను చర్చల వేదికపైకి తీసుకురావడమే ఈ చర్యల ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేసింది. ఈ ప్రకటన వెలువడటానికి ఒక రోజు ముందే, పుతిన్‌తో బుడాపెస్ట్‌లో జరగాల్సిన సమావేశాన్ని నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ట్రంప్ వెల్లడించారు. "పుతిన్‌తో మాట్లాడిన ప్రతిసారీ చర్చలు బాగానే సాగుతాయి, కానీ అవి ఎక్కడికీ దారితీయడం లేదు" అని ట్రంప్ తన అసహనాన్ని వ్యక్తం చేశారు. ఇప్పటివరకు సంయమనం పాటిస్తూ వచ్చిన ట్రంప్ సర్కార్, ఒక్కసారిగా ఈ కఠిన నిర్ణయం తీసుకోవడం ఆయన విదేశాంగ విధానంలో వచ్చిన పెద్ద మార్పుగా నిపుణులు విశ్లేషిస్తున్నారు. అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ మాట్లాడుతూ, "ఈ అర్థంలేని యుద్ధాన్ని ముగించడానికి పుతిన్ నిరాకరిస్తున్నందువల్లే ఈ ఆంక్షలు అవసరమయ్యాయి" అని తెలిపారు. రష్యాకు చెందిన రాస్‌నెఫ్ట్, లుకాయిల్ అనే ఈ రెండు కంపెనీలు రష్యా యుద్ధ యంత్రాంగానికి నిధులు సమకూరుస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఈ రెండు కంపెనీలు రోజుకు 3.1 మిలియన్ బ్యారెళ్ల చమురును ఎగుమతి చేస్తాయి. అమెరికా తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ స్వాగతించారు. ఇది అమెరికా నుంచి వచ్చిన మంచి సంకేతం అని, ఇతర దేశాలు కూడా ఇలాగే ఒత్తిడి పెంచితే కాల్పుల విరమణ సాధ్యమవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. గతవారమే బ్రిటన్ కూడా ఇదే తరహా ఆంక్షలను ప్రకటించగా, యూరోపియన్ యూనియన్ సైతం రష్యా నుంచి దిగుమతయ్యే సహజ వాయువుపై నిషేధం విధించింది. ఈ పరిణామాలపై స్పందించిన రష్యా, ఇటువంటి చర్యలు ప్రపంచ ఇంధన సరఫరాలకు అంతరాయం కలిగిస్తాయని, చర్చల ప్రక్రియను మరింత క్లిష్టతరం చేస్తాయని హెచ్చరించింది. కాగా, గత శుక్రవారం వైట్‌హౌస్‌లో ట్రంప్‌తో సమావేశమైన జెలెన్‌స్కీ, రష్యా భూభాగంలోకి చొచ్చుకెళ్లి దాడులు చేసేందుకు వీలుగా సుదూర లక్ష్యాలను ఛేదించే టోమాహాక్ క్షిపణులను అందించాలని కోరగా, ట్రంప్ నిరాకరించారు. అయితే, ఆంక్షల విషయంలో మాదిరిగానే భవిష్యత్తులో క్షిపణులపై కూడా ట్రంప్ తన మనసు మార్చుకోవచ్చని జెలెన్‌స్కీ సూచనప్రాయంగా తెలిపారు. మరోవైపు, ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై రష్యా దాడులు కొనసాగుతూనే ఉన్నాయి.

## టెక్ హబ్‌గా ఏపీ, ఇంధన రంగంలో అపార అవకాశాలు...

- మొదటి పేజి తరువాయి

పనిచేస్తున్న జీ 42 ఇంటర్నేషనల్ సంస్థను ఏఐ డేటా సెంటర్లు, ఇన్నోవేషన్ ల్యాబ్స్, స్మార్ట్ గవర్నెన్స్ టెక్నాలజీని రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు స్వాగతించారు.

**టెక్ కంపెనీ ప్రతినిధులతో నెట్వర్క్ లంచ్**

అనంతరం అబుదాబీలోని పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి చంద్రబాబు బృందం నెట్వర్క్ లంచ్ సమావేశంలో పాల్గొంది. దీనిలో జీ 42 సీఈవో మనుకుమార్ జైన్, ఏడీఐసీ గ్లోబల్ హెడ్ లలిత్ అగర్వాల్, ఐహెచ్‌సీ సీఈవో అజయ్ భాటియా, డబ్ల్యుఐవో బ్యాంక్ సీఈవో జయేష్ పాటిల్, పాలిగాన్ మార్ఫిక్ సీఈవో జయంతి కనాని, ట్రక్కర్ సీఈవో గౌరవ్ బిశ్వాస్, పాలసీ బజార్ గ్రూప్ సీఈవో యశిష్ దహియా, ఇన్స్యూరెన్స్ మార్కెట్ సీఈవో అవినాష్, ఇన్సార్ట్స్ సీఈవో అజార్ ఇక్బాల్, జీఐఐ సీఈవో పంకజ్ గుప్తా, నూన్ సీఈవో ఫరాజ్ ఖలీద్, ఇన్సెప్షన్ సీఈవో ఆశీష్ కోషి పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను భారతదేశానికి టెక్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దే లక్ష్యాన్ని వారికి వివరించారు. రాష్ట్రంలో డేటా సెంటర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-మెషిన్ లెర్నింగ్, ఫిన్ టెక్, హెల్త్ టెక్, క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ గవర్నెన్స్ వంటి రంగాల్లో పెట్టుబడులకు గల అవకాశాలను సూచించారు. త్వరలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా ఏపీలో ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. యూఏఈలో టెక్నాలజీ ఆధారిత కంపెనీలతో సంయుక్త వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేసి ఏపీలో భవిష్యత్ ప్రాజెక్టులను వేగంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి తన ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, టీజీ భరత్‌తో పాటు పరిశ్రమలశాఖ, ఈడీబీకి చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## జగన్ సంబంధం లేని విషయాల్లో క్రెడిట్ కొట్టేసే ప్రయత్నం చేస్తున్నారు

వైసీపీ అధినేత జగన్ మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలపై టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జగన్ తీరు "పాపాలు చేసేవాళ్లు నీతులు చెప్పినట్లుగా" ఉందని సోషల్ మీడియా వేదికగా ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో జరిగిన అనేక వ్యవహారాలకు బాధ్యత వహించకుండా, సంబంధం లేని విషయాల్లో క్రెడిట్ కొట్టేసే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. "పాపాలు చేసేవాళ్లు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉంది. జగన్ ప్రెస్ మీట్‌లో చేసిన కామెంట్లు వింటే, ఏదో నీతులు చెప్పినట్టుగానే ఉన్నాయి" అని సోమిరెడ్డి తన విమర్శలకు పదును పెట్టారు. గూగుల్ డేటా సెంటర్ విషయంలో జగన్ ద్వంద్వ వైఖరిని అవలంబిస్తున్నారని ఆయన ఆరోపించారు. "గతంలో అదే డేటా సెంటర్‌ను ఒక గోడౌన్ మాత్రమేనని, అక్కడ అంత సీన్ లేదని తమ సొంత పత్రిక సాక్షిలో కథనాలు రాయించారు. ఇప్పుడు అదే ప్రాజెక్టును తానే తెచ్చినట్లు గొప్పలు చెప్పుకుంటున్నారు. ఇలా మాట్లాడటానికి సిగ్గు, బుద్ధి ఉండాలి" అని ఘాటుగా వ్యాఖ్యానించారు. గతంలో కియా మోటార్స్‌ను తన తండ్రే తెచ్చారని చెప్పిన జగన్, ఇప్పుడు గూగుల్ క్రెడిట్ కూడా తానే కొట్టేయాలని చూస్తున్నారని విమర్శించారు. పెట్టుబడులను ఆకర్షించడం చేతకాక, జాకీ వంటి డ్రాయర్ల కంపెనీని కూడా వెళ్లగొట్టిన ఘనత జగన్‌దని సోమిరెడ్డి ఆరోపించారు. నకిలీ మద్యం వ్యవహారంపై కూడా సోమిరెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న నకిలీ మద్యం దందాలో జగన్ పాత్ర ఉందని, దానిని కప్పిపుచ్చుకునేందుకే సంబంధం లేదని బుకాయిస్తున్నారని అన్నారు. "జగన్-జోగి రమేశ్-జనార్దన్ రావు కాంబినేషన్‌లో నకిలీ మద్యాన్ని తయారు చేయించి, ప్రజాధనాన్ని గుటుక్కున మింగింది చాలక ఇంకా పిచ్చి కబుర్లు చెబుతారా?" అని ప్రశ్నించారు. మద్యం బాటిళ్లపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే వాస్తవాలు బయటకు వస్తాయని, ఈ నిజాన్ని ప్రజల నుంచి పక్కదారి పట్టించేందుకే జగన్ దానిని డైవర్షన్ అంటున్నారని మండిపడ్డారు. ఆ క్యూఆర్ కోడ్‌ను దుకాణదారులే కాకుండా వినియోగదారులు, కావాలంటే జగన్ కూడా స్కాన్ చేసి నిజానిజాలు తెలుసుకోవచ్చని సవాల్ విసిరారు. అభివృద్ధి విషయంలో జగన్ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని సోమిరెడ్డి విమర్శించారు. "భోగాల కోసం రుషికొండపై ప్యాలెస్ కట్టుకున్న పెద్ద మనిషి, ఇప్పుడు భోగాపురం ఎయిర్‌పోర్టు గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉంది" అని అన్నారు. జగన్ తీరును గమనిస్తుంటే, "ఇన్నాళ్లూ జగన్‌ను సగం పిచ్చోడనుకున్నాం, కానీ ఇప్పుడు పూర్తి పిచ్చోడని స్పష్టంగా అర్థమైంది" అంటూ సోమిరెడ్డి తన ట్వీట్‌ను ముగించారు.

# బీహార్ సీఎం అభ్యర్థిగా తేజస్వి యాదవ్

బీహార్ రాజకీయాల్లో గత కొన్ని వారాలుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. రానున్న అసెంబ్లీ ఎన్నికల కోసం ప్రతిపక్ష 'మహాఘటబంధన్' (మహాకూటమి) తన ముఖ్యమంత్రి అభ్యర్థిని అధికారికంగా ప్రకటించింది. ఆర్జేడీ యువనేత తేజస్వి యాదవ్ నాయకత్వంలోనే కూటమి ఎన్నికల బరిలోకి దిగనుందని స్పష్టం చేసింది. పాట్నాలోని మౌర్య హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కూటమి భాగస్వామ్య పక్షాల నేతల సమక్షంలో ఈ కీలక ప్రకటన వెలువడింది. రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి, బీహార్ కాంగ్రెస్ ఎన్నికల ఇన్‌ఛార్జ్ అశోక్ గెహ్లాట్.. తేజస్వి యాదవ్‌ను సీఎం అభ్యర్థిగా ప్రకటిస్తూ నిర్ణయాన్ని వెల్లడించారు. ఇదే సమయంలో డిప్యూటీ సీఎం అభ్యర్థిగా ముఖేశ్ సహానీ పేరును కూడా ఆయన ఖరారు చేశారు. "తేజస్వి యాదవ్ ఒక యువ నాయకుడు. ఇచ్చిన మాట నిలబెట్టుకునే వ్యక్తి. ఆయనకు సుదీర్ఘ రాజకీయ భవిష్యత్తు ఉంది. అందుకే, ఆయన నాయకత్వంలోనే ఈ ఎన్నికల్లో పోటీ చేయాలని మేమంతా నిర్ణయించాం" అని అశోక్ గెహ్లాట్ ఈ సందర్భంగా తెలిపారు. సీట్ల పంపకాలు, సీఎం అభ్యర్థిత్వంపై ఆర్జేడీ, కాంగ్రెస్ పార్టీల మధ్య తీవ్రస్థాయిలో విభేదాలు తలెత్తిన విషయం తెలిసిందే. 2020 ఎన్నికల్లో కేవలం 19 సీట్లు గెలిచినప్పటికీ, ఈసారి కూడా తమకు 70 సీట్లు కేటాయించాలని కాంగ్రెస్ పట్టుబట్టింది. అయితే, కాంగ్రెస్ గత ప్రదర్శన దృష్ట్యా అన్ని సీట్లు ఇచ్చేందుకు ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ సుముఖత చూపలేదు. దీంతో కూటమిలో ప్రతిష్టంభన ఏర్పడింది. పరిస్థితి చేయిదాటిపోతుండటంతో కాంగ్రెస్ అధిష్ఠానం రంగంలోకి దిగింది. సమస్య పరిష్కార బాధ్యతను అశోక్ గెహ్లాట్‌కు అప్పగించింది. బుధవారం పాట్నాకు చేరుకున్న ఆయన.. లాలూ ప్రసాద్ యాదవ్, రబ్రీ దేవి, తేజస్వి యాదవ్‌లతో సమావేశమై చర్చలు జరిపారు. ఈ చర్చల ఫలితంగానే కూటమిలోని అన్ని సమస్యలు పరిష్కారమయ్యాయని, అందరం కలిసికట్టుగా ఎన్నికల్లో పోరాడతామని గెహ్లాట్ ప్రకటించారు. తాజా ఒప్పందం ప్రకారం, ఆర్జేడీ 143 స్థానాల్లో పోటీ చేయనుంది. ఈ నిర్ణయంతో నితీశ్ కుమార్ నేతృత్వంలోని ఎన్డీయేను ఎదుర్కొనేందుకు మహాకూటమి ఐక్యంగా సిద్ధమైనట్టయింది. ఈ పరిణామం కూటమి ప్రచారానికి కొత్త ఊపునిస్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## పలు దేశాల్లో ప్రభుత్వాలను కూల్చేస్తున్న జెన్ జీ...

### ఇండియాలో ఎందుకు మౌనంగా ఉంది?

ఆసియా, ఆఫ్రికాలోని పలు దేశాల్లో 'జెన్ జీ' (1997-2012 మధ్య పుట్టిన తరం) యువత ప్రభుత్వాలనే కూల్చేస్తుంటే, ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా ఉన్న భారత్‌లో మాత్రం అలాంటి వాతావరణం కనిపించడం లేదు. దేశంలో దాదాపు 37 కోట్ల మంది జెన్ జీ యువత ఉన్నప్పటికీ, అవినీతి, నిరుద్యోగం, అసమానతలపై తీవ్ర అసంతృప్తితో ఉన్నా.. వారు భారీ ఉద్యమాలకు ఎందుకు దూరంగా ఉంటున్నారనే విషయంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఇటీవల నేపాల్‌లో యువత కేవలం 48 గంటల్లో ప్రభుత్వాన్ని గద్దెదించింది. బంగ్లాదేశ్, ఇండోనేషియా వంటి దేశాల్లోనూ యువతరం ఆందోళనలతో ప్రభుత్వాలు దిగివచ్చిన సంఘటనలు ఉన్నాయి. సోషల్ మీడియా, ఎన్‌క్రిప్టెడ్ యాప్‌ల ద్వారా వేగంగా ఏకమై, అవినీతిపై పోరాడుతూ వారు సంచలనాలు సృష్టిస్తున్నారు. ఈ పరిణామాలను గమనిస్తున్న భారత ప్రభుత్వం కూడా అప్రమత్తమైంది. ముఖ్యంగా నేపాల్ పరిణామాల నేపథ్యంలో, ఢిల్లీలో యువత ఆందోళనలు చేపట్టే అవకాశం ఉందన్న అంచనాలతో పోలీసులు అత్యవసర ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. భారత్‌లో యువత రోడ్ల మీదకు వచ్చి పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టకపోవడానికి అనేక కారణాలు కనిపిస్తున్నాయి. నిపుణుల విశ్లేషణ ప్రకారం, ప్రధాన కారణం వారి మధ్య ఐక్యత లేకపోవడమే. "భారత్‌లో యువత కులం, మతం, ప్రాంతం, భాష వంటి గుర్తింపులతో బలంగా ముడిపడి ఉంది. దీంతో వారి సమస్యలు, ఆకాంక్షలు కూడా వేర్వేరుగా ఉంటున్నాయి" అని సెంటర్ ఫర్ యూత్ పాలసీకి చెందిన సుధాంశు కౌశిక్ వివరించారు. ఉదాహరణకు, తమిళనాడులో జల్లికట్టు కోసం, గుజరాత్‌లో రిజర్వేషన్ల కోసం జరిగిన నిరసనలు స్థానిక సమస్యలకే పరిమితమయ్యాయి తప్ప దేశవ్యాప్త ఉద్యమాలుగా మారలేదు. మరోవైపు, నిరసనల్లో పాల్గొంటే 'దేశ వ్యతిరేకులు' అనే ముద్ర వేస్తారనే భయం కూడా యువతను వెనక్కి లాగుతోంది. "ఈ రోజుల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే దేశద్రోహిగా చిత్రీకరిస్తున్నారు. ఈ భయంతో చాలామంది మౌనంగా ఉంటున్నారు" అని ఓ పొలిటికల్ సైన్స్ గ్రాడ్యుయేట్ అభిప్రాయపడ్డారు. దీనికి తోడు, ఒకప్పుడు రాజకీయ చర్చలకు కేంద్రంగా ఉన్న యూనివర్సిటీల్లో కూడా ఇప్పుడు నిరసనలపై ఆంక్షలు పెరిగాయి.

ఆర్థిక ఒత్తిళ్లు కూడా యువత దృక్పథాన్ని మారుస్తున్నాయి. ఉద్యమాలు చేయడం కంటే మంచి ఉద్యోగం సంపాదించి స్థిరపడటం లేదా విదేశాలకు వలస వెళ్లడంపైనే ఎక్కువ మంది దృష్టి పెడుతున్నారని నిపుణులు చెబుతున్నారు. రాజకీయ వ్యవస్థపై నమ్మకం సన్నగిల్లడం కూడా మరో కారణం. 2024 ఎన్నికల్లో 18 ఏళ్ల వయసున్న వారిలో కేవలం 38% మాత్రమే ఓటర్లుగా నమోదు చేసుకోవడం దీనికి నిదర్శనం. యువతలో 29% మంది రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉంటున్నట్లు ఓ సర్వేలో తేలింది. ఈ కారణాలన్నీ కలిసి, అపారమైన శక్తి ఉన్నప్పటికీ భారత జెన్ జీ ఒకేతాటిపైకి వచ్చి భారీ ఉద్యమాలు చేసే అవకాశాలు ప్రస్తుతానికి తక్కువగా ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

# హైదరాబాద్‌ను ముంచెత్తిన వాన... స్తంభించిన జనజీవనం

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌ను గురువారం సాయంత్రం భారీ వర్షం ముంచెత్తింది. ఉరుములు, మెరుపులతో కూడిన కుండపోత వాన కారణంగా నగర జీవనం ఒక్కసారిగా స్తంభించిపోయింది. పలు ప్రధాన రహదారులన్నీ జలమయమై, కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ నిలిచిపోవడంతో కార్యాలయాల నుంచి ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నగరంలోని అల్వాల్, శామీర్‌పేట్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, అమీర్‌పేట్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, సనత్‌నగర్, ఎర్రగడ్డ సహా అనేక ప్రాంతాల్లో ఏకధాటిగా వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. రోడ్లపై వర్షపు నీరు భారీగా చేరడంతో ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయి, నగరంలో తీవ్రమైన ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ వాతావరణ శాఖ కీలక హెచ్చరిక జారీ చేసింది. మరో గంట వ్యవధిలో ఉప్పల్, తార్నాక, సికింద్రాబాద్, హిమాయత్‌నగర్, ఖైరతాబాద్, బేగంపేట్, మాదాపూర్, మియాపూర్, హైటెక్ సిటీ, శేర్లింగంపల్లి వంటి ప్రాంతాల్లో కూడా

భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. వాతావరణ శాఖ హెచ్చరికలతో హైదరాబాద్ నగర పోలీసులు కూడా స్పందించారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని విజ్ఞప్తి చేశారు. ప్రయాణాల్లో ఉన్నవారు సురక్షిత ప్రాంతాల్లో వేచి ఉండాలని, ట్రాఫిక్‌లో చిక్కుకోకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. తెలంగాణ వ్యాప్తంగా నెలకొన్న వాతావరణ పరిస్థితుల కారణంగా ఈ వర్షాలు కురుస్తున్నాయని, ప్రజలు వాతావరణ శాఖ అప్‌డేట్‌లను గమనిస్తూ ఉండాలని అధికారులు తెలిపారు.

## పాకిస్థాన్‌లో హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై రగడ... ఎందుకీ వ్యతిరేకత?

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (సర్వైకల్ క్యాన్సర్) మహమ్మారిని దేశం నుంచి తరిమికొట్టేందుకు పాకిస్థాన్ ప్రభుత్వం చేపట్టిన చరిత్రాత్మక వ్యాక్సినేషన్ కార్యక్రమానికి తప్పుడు ప్రచారాలు పెద్ద అడ్డంకిగా మారాయి. వ్యాక్సిన్‌పై ప్రజల్లో నెలకొన్న అనుమానాలు, అపోహలను తొలగించేందుకు ఆ దేశ ఆరోగ్య శాఖ మంత్రి సయ్యద్ ముస్తఫా కమల్ అసాధారణ చర్య తీసుకున్నారు. స్వయంగా తన కుమార్తెను మీడియా ముందుకు తీసుకొచ్చి, బహిరంగంగా హెచ్‌పీవీ టీకా వేయించి ప్రజల్లో నమ్మకాన్ని కలిగించే ప్రయత్నం చేశారు. పాకిస్థాన్‌లో గర్భాశయ క్యాన్సర్ కారణంగా ప్రతిరోజూ 8 మంది మహిళలు మరణిస్తున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) గణాంకాలు చెబుతున్నాయి. ఈ వ్యాధికి ప్రధాన కారణమైన హ్యూమన్ పాపిలోమావైరస్ (హెచ్‌పీవీ)ని నిరోధించేందుకు, పాక్ ప్రభుత్వం సెప్టెంబర్ 15న దేశవ్యాప్తంగా మెగా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. మొదటి దశలో 9 నుంచి 14 ఏళ్లలోపు 1.3 కోట్ల మంది బాలికలకు టీకా వేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

అయితే, కార్యక్రమం మొదలైన కొద్ది రోజులకే సోషల్ మీడియాలో నకిలీ వీడియోలు, వదంతులు వెల్లువెత్తాయి. ఈ వ్యాక్సిన్ వంధ్యత్వానికి కారణమవుతుందని, ఇది విదేశీ కుట్రలో భాగమని దుష్ప్రచారం ఊపందుకుంది. దీంతో చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలకు టీకా వేయించేందుకు నిరాకరించారు. కొన్ని పాఠశాలలు కూడా ఆరోగ్య కార్యకర్తలను లోపలికి అనుమతించలేదు. ఈ ప్రతికూల పరిస్థితుల మధ్య, ఆరోగ్య మంత్రి ముస్తఫా కమల్ కరాచీలో తన కుమార్తెకు టీకా వేయించారు. "ఈ వ్యాక్సిన్ సురక్షితమైనది, సమర్థవంతమైనది. మా ఆడపిల్లలను రక్షించుకోవడం చాలా ముఖ్యం. ఇలాంటి తప్పుడు ప్రచారాలను ఎవరూ నమ్మవద్దు" అని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మంత్రి తీసుకున్న ఈ చర్య సత్ఫలితాలనిచ్చింది. ప్రజల్లో నెమ్మదిగా నమ్మకం పెరగడంతో, టీకా తీసుకునే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. దీంతో మొదట సెప్టెంబర్ 27తో ముగియాల్సిన కార్యక్రమాన్ని అక్టోబర్ 1 వరకు పొడిగించారు. సింధ్ ప్రావిన్స్ ఆరోగ్య మంత్రి డాక్టర్ అజ్రా ఫజల్ మాట్లాడుతూ, "అపోహలు తొలగిపోయాక, ప్రజలు స్వచ్ఛందంగా టీకా కేంద్రాలకు రావడం మొదలుపెట్టారు" అని తెలిపారు. ఇప్పటివరకు లక్ష్యంగా నిర్దేశించుకున్న 1.3 కోట్ల మందిలో 92 లక్షల మంది (78 శాతం) బాలికలకు వ్యాక్సినేషన్ పూర్తయింది. రాబోయే దశల్లో మిగతా ప్రావిన్సులలో కూడా ఈ కార్యక్రమాన్ని విస్తరించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

# బాలకృష్ణపై జగన్ సంచలన ఆరోపణలు.. అసెంబ్లీకి తాగి వచ్చారంటూ ఫైర్!

- మొదటి పేజి తరువాయి

విరుచుకుపడ్డారు. "అసెంబ్లీలో మాట్లాడాల్సింది ఏంటి? ఆయన మాట్లాడింది ఏంటి? అదంతా పనికిమాలిన సంభాషణ. బాలకృష్ణ అసెంబ్లీలో తాగి మాట్లాడారు. తాగి వచ్చిన వ్యక్తిని సభలోకి ఎలా అనుమతిస్తారు? అలా మాట్లాడేందుకు అనుమతించిన స్పీకర్‌కు బుద్ధి లేదు" అని జగన్ తీవ్రంగా విమర్శించారు. అంతటితో ఆగకుండా, "బాలకృష్ణ మానసిక స్థితి ఏంటో ఆ మాటలతోనే అర్థమవుతోంది. తన సైకలాజికల్ ఆరోగ్యం ఎలా ఉందో ఆయనే ప్రశ్నించుకోవాలి" అని వ్యాఖ్యానించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో... గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సినీ ప్రముఖులను అవమానించారంటూ బీజేపీ ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ శాసనసభలో చర్చను ప్రారంభించారు. దానిని కొనసాగిస్తూ హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ... జగన్, మెగాస్టార్ చిరంజీవిని ఉద్దేశించి కొన్ని వ్యాఖ్యలు చేయడం రాజకీయంగా పెద్ద చర్చకు

దారితీసింది. అయితే, బాలకృష్ణ తన ప్రస్తావన తీసుకురావడంపై నటుడు చిరంజీవి అప్పట్లోనే ఒక ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వంలో తమకు ఎలాంటి అవమానం జరగలేదని, అప్పటి ముఖ్యమంత్రి జగన్ తనను ఎంతో గౌరవంగా ఆహ్వానించి మాట్లాడారని ఆయన స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

# వర్ష ప్రభావిత జిల్లాలకు నిధుల విడుదల...

రాష్ట్రంలో పలు జిల్లాలను భారీ వర్షాలు ముంచెత్తుతున్న నేపథ్యంలో, ముఖ్యమంత్రిచంద్రబాబు విదేశీ పర్యటనలో ఉన్నప్పటికీ పాలనను పరుగులు పెట్టించారు. దుబాయ్ నుంచే ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, తక్షణ సహాయక చర్యలకు కీలక ఆదేశాలు జారీ చేశారు. వర్షాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం దుబాయ్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, సంబంధిత మంత్రులు, జిల్లాల కలెక్టర్లు, ఆర్టీజీఎస్ అధికారులతో ప్రత్యేకంగా మాట్లాడారు. వర్షాల తీవ్రత ఎక్కువగా ఉన్న నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాలకు తక్షణ సహాయక చర్యల కోసం రూ. 2 కోట్ల చొప్పున అత్యవసర నిధులు విడుదల చేయాలని ఆదేశించారు. మిగిలిన వర్ష ప్రభావిత జిల్లాలకు కూడా రూ. 1 కోటి చొప్పున నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

సహాయక చర్యలను మరింత వేగవంతం చేసేందుకు, కడప, నెల్లూరు, ప్రకాశం, తిరుపతి జిల్లాలకు రాష్ట్ర విపత్తు స్పందన దళాలను (ఎస్డీఆర్ఎఫ్) వెంటనే తరలించాలని ముఖ్యమంత్రి సూచించారు. నెల్లూరు

జిల్లాలో పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, జాతీయ విపత్తు స్పందన దళాలను (ఎన్డీఆర్ఎఫ్) కూడా రంగంలోకి దించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్లకు సూచించారు.

పెన్ పవర్
గుంటూరు । బాపట్ల । పల్నాడు

## రూ.4 కోట్లతో తక్షణమే ప్రజలకు అత్యవసరమైన
# మౌలికవసతులు కల్పించండి

**పట్టణాభివృద్ధిలో ఐటీసీ భాగస్వామ్యం ప్రజలకు మేలు చేస్తుంది.**
**సీ.ఎస్.ఆర్ నిధులతో రోడ్ల విస్తరణ, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్, సుందరీకరణ, వాణిజ్య సముదాయాల నిర్మాణంపై ఐటీసీ దృష్టి పెట్టాలి.**
**పట్టణాభివృద్ధి సమీక్ష సమావేశంలో మాజీమంత్రి ప్రత్తిపాటి.**





**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, అక్టోబర్ 23:**

చిలకలూరిపేట : పట్టణాబివృద్ధిలో భాగంగా పలు విభాగాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులన్నీ సత్వరమే పూర్తి చేయాలని, తాజాగా మంజూరైన డీ.ఎమ్.ఎఫ్, 15వ ఆర్థిర సంఘం నిధులతో ప్రజలకు అత్యవసరమైన మౌలిక వసతుల కల్పన చేపట్టాలని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశించారు. పట్టణవ్యాప్తంగా మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే ప్రత్తిపాటి కూటమినేతలతో కలిసి మున్సిపల్ సిబ్బంది, ఐటీసీ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. డీ.ఎమ్.ఎఫ్ (డిస్ట్రిక్ట్ మైనింగ్ ఫండ్) రూ.2కోట్లు, 15 వ ఆర్థిక సంఘం నిధులు రూ.2కోట్లు మొత్తం రూ.4 కోట్లతో పట్టణంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు నిర్మాణం చేపట్టాలని మున్సిపల్ అధికారుల్ని ప్రత్తిపాటి ఆదేశించారు. ఐ.టీ.సీ సంస్థ సీఎస్సార్ నిధులతో పట్టణాభివృద్ధికి సహకరించాలని, మున్సిపల్ సిబ్బంది అందించిన ప్రతిపాదనలు పరిశీలించాలని ప్రత్తిపాటి కోరారు. పట్టణాభివృద్ధిలో ఐటీసీ భాగస్వామ్యం ప్రజలకు మేలు చేస్తుందన్న ఆయన, రోడ్ల వెడల్పు, డివైడర్ల ఏర్పాటు, సెంట్రల్ లైటింగ్, సుందరీకరణ, వాణిజ్య దుకాణ సముదాయాల నిర్మాణ పనుల్లో భాగస్వాములు కావాలని ఐటీసీ ప్రతినిధుల్ని కోరారు. కృష్ణ మహల్ సెంటర్ నుంచి ఏ.ఎం.జీ చెక్ పోస్ట్ వరకు మధ్యలో డివైడర్ నిర్మించి, సెంట్రల్ లైటింగ్, సుందరీకరణ పనులు లేదా ఆక్రమణలో భాగంగా పట్టణపరిధిలో దుకాణాలు కోల్పోయిన వారికి వాణిజ్య సముదాయం నిర్మించడం గానీ చేపట్టాలని ప్రత్తిపాటి ఐటీసీ ప్రతినిధులకు సూచించారు. దుకాణాలు కోల్పోయి జీవనోపాధి కరువైన వారికి మున్సిపాలిటీలో నిర్మించే దుకాణాలు కేటాయించేలా డీపీఆర్ లు సిద్ధం చేయాలని ప్రత్తిపాటి అధికారులకు సూచించారు. మున్సిపాలిటీలో జరిగే వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్న ప్రత్తిపాటి. పనులన్నీ ఎప్పుడు పూర్తవుతాయని ప్రశ్నించారు. వర్షాల వల్ల కాస్త ఆలస్యం అవుతున్నాయని, త్వరలోనూ పూర్తిచేస్తామని అధికారులు చెప్పగా.. సత్వరమే పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ నుంచి నరసరావుపేట రోడ్డువరకు ఉన్న బైపాస్ విస్తరణ పనులు వెంటనే ప్రారంభించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. వీరముష్టి కాలనీలో మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టాలని, శివారు ప్రాంతాల్లో రోడ్లు.. డ్రైనేజ్ ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. వర్షాలతీవ్రత దృష్ట్యా, కాలువలు.. రోడ్లపై ఎక్కడా చెత్తలేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని, రోడ్లపైకి వర్షపునీరు రాకుండా చూడాలని, నిత్యం శానిటేషన్ చేపట్టాలని ప్రత్తిపాటి మున్సిపల్ సిబ్బందికి సూచించారు. రోగాలు, అంటువ్యాధులు ప్రబల కుండా, దోమల బెడద లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్ష సమావేశంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మున్సిపల్ కమిషనర్ పి. శ్రీహరి బాబు, డిఇ అబ్దుల్ రహీమ్, ఐటీసీ అధికారులు దీక్షితులు, వరప్రసాద్ (ఐటీసీ బాబు), టిపియస్ వెంకటేశ్వరావు, ఇంచార్జి సర్వేయర్ రాజేష్, మున్సిపల్ అధికారులు, టీడీపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# పెదన షాదీఖానాలో బిఓయుఐ ఆధ్వర్యంలో ఘనంగా బైబిల్ సెమినార్







**మచిలీపట్నం (పెన్ పవర్) అక్టోబర్ 23:**

పెదన పట్నం షాది ఖానాలో బైబిల్ సెమినార్ ను బైబిల్ ఓపెన్ యూనివర్సిటీ ఇండియా ఇంటర్నేషనల్ (బి ఓ యు ఐ) ఆధ్వర్యంలోఘనంగా నిర్వహించారు. ఈ బైబిల్ సెమినార్ లో 3 అంశాల మీద ప్రసంగాలు చేశారు. వాక్యోపదేశకులు బ్రబబ పి. జీవన్ బాబు (సీబీటి ప్రిన్సిపల్ పెదన)గారు విశ్వాసము యొక్క పరీక్ష స్వభావ లక్షణాలు, విజయము. అనే బైబిల్ పాఠం ద్వారా క్రైస్తవ భక్త విశ్వాసులకు అనేక విషయాలను తెలియజేశారు. ముఖ్య వాక్యోపదేశకులుబ్రదర్ శాంసన్ (అడిషనల్ డిప్యూటిడైరెక్టర్-గుంటూరు) పాపం కలిగించు భయం అనే పాఠం గురించి క్రైస్తవ భక్త విశ్వాసులకు వివరించడం జరిగింది. బ్రతుకు మార్చుకోండి, పాపం జోలికి వెళ్ళకండి, పాపం చేయకండి అని బైబిల్ లో నుంచి కొన్ని వాక్యాలను తీసుకుని జరిగిన సందర్భాలను వివరించారు. అలాగే మరొక పాఠం పాడవుతున్న పవిత్ర బంధం - ప్రశ్నిస్తున్న పరిశుద్ధ గ్రంథం ఈ పాఠం ద్వారా భార్య భర్తలు ఎలా ఉండాలి నేటి సమాజం లో అనేక రకాల గోరాలు జరుగుతూ సమాజం పాడైపోతుంది బైబిల్ భార్య భర్తల గురించి బైబిల్ ఎలా చెప్తుంది అని, ఇద్దరూ ఎలా ప్రేమ కలిగి నడుచుకోవాలి, అందము మోసకరము సౌందర్యము వ్యర్థము, ముఖ్యమైనది గుణం మీ జీవితాలను ఒకసారి పరిశీలించుకోండి అని ఇంకా మరెన్నో బైబిల్ వాక్యాల ద్వారా ఆత్మీయ సందేశాన్ని వివరించారు.

# ఎమ్మెల్యే గళ్ళా మాధవి చేతుల మీదుగా విద్యార్ధినికి ఆర్ధిక సహాయం...



**పెన్ పవర్, గుంటూరు, అక్టోబర్, 23.**

గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి చేతుల మీదుగా గుంటూరు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని తేజస్వినికి పాఠ్య పుస్తకాలు,ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... సమాజంలో విద్య అనేది జీవితాలను మార్చే శక్తి. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రతిభావంతులైన విద్యార్థులు ముందుకు సాగేందుకు సహకరించటం మనందరి బాధ్యత. తేజస్విని వంటి విద్యార్థులు వైద్యరంగంలో రాణించి సమాజానికి సేవ చేయాలి" అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఇటువంటి బృహత్కర కార్యక్రమానికి పూనుకున్న గుంటూరు పరుచూరి వీర రాఘవులు సేవా సంఘం వారు పుస్తకాల కొనుగోలుకు రూ.10,000 మరియు ఇతర అవసరాల కోసం రూ.5,000 మొత్తంగా రూ.15,000ను విద్యార్థినికి అందించటం అభినందనీయమన్నారు. సేవా సంఘం అధ్యక్షులు పరుచూరి సంజీవరావు మాట్లాడుతూ... ఎమ్మెల్యే గళ్ళా మాధవి నాయకత్వంలో రాబోయే రోజుల్లో తేజస్విని విద్యాభ్యాసానికి అవసరమయ్యే అన్ని ఖర్చులను భరిస్తాం. విద్యారంగంలో ఇలాంటి సహాయం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ చాంద్, ఖర్జూర శ్రీను, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల్లో సైబర్ నేరాలు, మోసాల పట్ల అవగాహన ఆదేశాలు జారీ..ఎస్పీ వకుల్ జిందాల్

**పెన్ పవర్, గుంటూరు, అక్టోబర్, 23.**

అవగాహనతోనే సైబర్ నేరాలు/మోసాలను అరికట్టవచ్చు" అనే వాక్యాన్ని ఆయుధంగా తీసుకుని అవగాహన కల్పించాలని సూచన. 1930 జాతీయ సైబర్ భద్రత సహాయత నంబర్. గురించి విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచన. దేశవ్యాప్తంగా వేగంగా పెరుగుతున్న సైబర్ నేరాల ముప్పును తగ్గించడం, ప్రజల్లో సైబర్ భద్రతపై చైతన్యం పెంపొందించడం లక్ష్యంగా కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ( ఎం హెచ్ ఏ ) ఆధ్వర్యంలో ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (%।%4సి) పలు అవగాహన కార్యక్రమాలను చేపడుతోంది. అక్టోబర్ నెలను జాతీయ సైబర్ భద్రతా అవగాహన మాసం. గా ప్రకటించి, దేశవ్యాప్తంగా పోలీసు శాఖలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ సంస్థలు విస్తృతంగా ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్ లో, గ్రామ/వార్డు మహిళా పోలీసులకు సైబర్ నేరాలు మరియు మోసాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, మహిళా పోలీసులకు పలు ముఖ్యమైన సూచనలు, ఆదేశాలను జారీ చేశారు.

ఎస్పీ మాట్లాడుతూ... మహిళా పోలీసులు క్షేత్ర స్థాయిలో ప్రతిరోజూ ప్రజలతో మమేకమై, బాల్య వివాహాలు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, పాఠశాలల్లో విద్యార్థినులకు మంచి-చెడుల స్పర్శ (గుడ్ -బాడ్ టచ్), సీసీ కెమెరాల ప్రాముఖ్యత వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అదే విధంగా ప్రజల భద్రతా సమస్యలను సంబంధిత పోలీస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ప్రజలకు సమీపంగా ఉండే మహిళా పోలీసుల పాత్ర ప్రశంసనీయం" అని పేర్కొన్నారు. తదుపరి, సైబర్ నేరాలు/మోసాలు ప్రజల ఆర్థిక స్థితిపై తీవ్ర






ప్రభావం చూపుతున్నాయని ఎస్పీ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు కేవలం అవగాహనలేమి కారణంగా సైబర్ నేరగాళ్ల బారిన పడి జీవితాంతం కూడబెట్టుకున్న డబ్బును కోల్పోతున్నారు. కొందరు బాధతో ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారు. కాబట్టి ప్రజల్లో అవగాహన కల్పించటం మనందరి నైతిక, సామాజిక బాధ్యత" అని స్పష్టం చేశారు. అవగాహనతోనే సైబర్ నేరాలు.మోసాలను అరికట్టవచ్చు" అనే వాక్యాన్ని ప్రతి ఒక్కరు ఒక ఆయుధంగా తీసుకుని ప్రజల్లో చైతన్యం పెంచాలని ఎస్పీ గారు పిలుపునిచ్చారు.

**మహిళా పోలీసులకు ఎస్పీ గారి సూచనలు :** ప్రతి మహిళా పోలీస్ తమ గ్రామం, వార్డులో ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి. పాఠశాలలు, కళాశాలలు, పంచాయతీ కార్యాలయాలు, కమ్యూనిటీ హాళ్లలో ప్రజా సమావేశాలు నిర్వహించాలి. ప్రజలకు ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయమని చెప్పాలి. వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదులు ఎలా ఇవ్వాలో వివరించాలి. ప్రజల్లో ఈ టోల్‌ఫ్రీ నంబర్, వెబ్‌సైట్ గురించి విస్తృత ప్రచారం చేయాలి.

**సైబర్ నేరాలు.మోసాలలో ముఖ్య రకాలు :**

బ్యాంక్ ఎటిఎం గడువు ముగిసిందని చెప్పి ఓటీపీ, బ్యాంక్ వివరాలు అడగడం. గుర్తు తెలియని లింకులు పంపించి ఫోన్ నుండి డేటా చోరీ చేయడం. సిబిఐ లేదా పోలీస్ అధికారులమని చెప్పి "డ్రగ్స్ ఉన్న పార్సిల్" పేరుతో బెదిరించి డబ్బు వసూలు చేయడం. ఎక్కువ జీతం వచ్చే ఉద్యోగం ఇప్పిస్తాం" అంటూ మోసం చేయడం. లోన్ యాప్ మోసాలు %--% డబ్బు తీసుకున్న తర్వాత బెదిరింపులు, వ్యక్తిగత వివరాలు బహిర్గతం చేస్తామని భయపెట్టడం. సోషల్ మీడియాలో నకిలీ ప్రొఫైల్‌లతో మమేకమై ఫోటోలు, మెసేజీలతో బ్లాక్‌మెయిల్ చేయడం. నకిలీ ట్రేడింగ్, లాటరీ, గిఫ్ట్ స్కీమ్‌ల పేరుతో మోసాలు. ప్రభుత్వ పథకాల పేరుతో ఏపీకి ఫైల్స్ పంపించి మొబైల్ డేటా చోరీ చేయడం.

**ఎస్పీ సూచన....:** ప్రతి మహిళా పోలీస్ సమాజంలో సైబర్ భద్రత రాయబారిగా నిలిచి, ప్రజలకు అవగాహన కల్పించాలి." ఈ సందర్భంగా ఎస్పీ పలు సైబర్ భద్రతా పోస్టర్లు, అవగాహన బ్రోచర్లు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఐటీ కోర్ సీఐ నిస్సార్ భాషా , హెడ్ కానిస్టేబుల్ కిషోర్ , మహిళా కానిస్టేబుళ్లు మానసా, అరుణ యాసిన్ తదితరులు పాల్గొన్నారు..

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రచ్చబండ" కార్యక్రమం నిర్వహించిన - బలసాని"





**పెన్ పవర్, గుంటూరు, అక్టోబర్, 23,**

గుంటూరు రూరల్ మండలం, తోకవారిపాలెం గ్రామంలో, మాజీ ముఖ్యమంత్రి వై.యస్.ఆర్ సీ.పీ అధ్యక్షులు " వై.యస్.జగన్ మోహన్ రెడ్డి" పిలుపు, ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, తురకపాలెం గ్రామంలో "రచ్చబండ" కార్యక్రమం నిర్వహించి, సంతకాల సేకరణ చేసిన, ప్రత్తిపాడు నియోజకవర్గ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి " బలసాని కిరణ్ కుమార్" . ఈ కార్యక్రమంలో, ప్రత్తిపాడు - తెనాలి నియోజకవర్గ పరిశీలకులు షేక్ గులాం రసూల్ మరియు గుంటూరు రూరల్ మండల మరియు తోకవారిపాలెం గ్రామ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు..

## ఉచిత విత్తనాలు పంపిణీ



**చిన్నగంజాం , పెన్ పవర్ , అక్టోబర్ 23**

ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటల వల్ల ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతోందని మండల ఎపిఎం సుబ్బారావు అన్నారు. మండలంలోని చిన్నగంజాం పంచాయతీ మహాలక్ష్మి కాలనీలో గురువారం వెలుగు డిఆర్డిఏ మరియు పకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో సర్పంచ్ రాయని అత్మరావు సమక్షంలో 70 కుటుంబాలకు ఉచితంగా విత్తనాలు పంపిణీ నిర్వహించారు. ఇ సందర్భంగా ఎపిఎం సుబ్బారావు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఫెర్టిలైజర్స్ ద్వారా పండించడం వల క్యాన్సర్, నరాల బలహీనత, గుండె జబ్బులు, గ్యాస్ట్రిక్ సమస్యలు వంటి పలు రకాల వ్యాధులు బారిన పడుతన్నారన్నారు.దినికోసం మండల సమాఖ్య ద్వారా ఉచితంగా విత్తనాలు పంపిణీ జరుగుతుందని వీటిని సద్వినియోగం చేసుకోని మహిళలు పూర్తిగా సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో పండించటం ద్వారా ఆరోగ్యం,డబ్బు అదా చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎపిఎం సుబ్బారావు,సర్పంచ్ రాయని అత్మరావు,ఐ సి ఆర్ పి లు పద్మ,రజిని,భార్గవి, లోకేశ్వరి మరియు వివోఏ శ్రీలక్ష్మి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## విద్యతో వెలుగుదీసే భవిష్యత్తు

### - శ్రీ సుబ్బరాయ నారాయణ కళాశాల ముందడుగు ఘనంగా శ్రీ సుబ్బరాయ నారాయణ కళాశాలలో ఔషధ శాస్త్ర విభాగపు తరగతి గదుల ప్రారంభోత్సవం



**నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి అక్టోబర్ 23**

పల్నాడు జిల్లా నరసరావుపేటలోని శ్రీ సుబ్బరాయ నారాయణ కళాశాల లో ఔషధ శాస్త్ర (ఫార్మసీ) కోర్సుల తరగతి గదుల ప్రారంభోత్సవ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్త, రాష్ట్ర బంగారు వ్యాపారుల సంఘం అధ్యక్షులు కపలవాయి విజయకుమార్, బత్తుల మురళి హాజరయ్యారు. అతిథులు ఔషధ శాస్త్ర విభాగాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. నేటి కాలంలో ఔషధ రంగంలో విశాల అవకాశాలు ఉన్నాయని, విద్యార్థులు కృషి చేసి సమాజానికి సేవ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్, కమిటీ సభ్యులు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజలకు ప్రతి రూపాయి ఖర్చు పై లెక్క చెప్పి తీరాలి.. ఎమ్మెల్యే గళ్ళా మాధవి..

**పెన్ పవర్, గుంటూరు, అక్టోబర్, 23.**

గుంటూరు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశంలో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి నగర అభివృద్ధి పనులపై ఖర్చుల విషయంలో పారదర్శకత లేకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ లో ఎక్కడ ఎంత ఖర్చు జరుగుతుందో ఎవరికి తెలియదు. మొక్కల నాటడం కోసం 55 లక్షలు అన్నారు, ఇంకొక పనికి 80 లక్షలు అన్నారు, కానీ లెక్కలు స్పష్టంగా లేవు. డీసిల్టేషన్ పనుల బిల్లులు చెల్లించటం లేదు. కొన్ని పనులు పూర్తికాకపోయినా బిల్లులు క్లియర్ అవుతున్నాయి. నా నియోజకవర్గంలో 100 కోట్ల రూపాయల వర్కులు జరిగితే, ఇప్పటివరకు కేవలం రెండు కోట్ల రూపాయలకే బిల్లులు క్లియర్ అయ్యాయి. మిగతా నిధుల పరిస్థితి తెలియదు, అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఘాటుగా వ్యాఖ్యానించారు. ప్రజా ప్రతినిధులుగా ఖర్చుల వివరాలు తెలుసుకునే హక్కు ఉందని స్పష్టం చేస్తూ, "మున్సిపల్ కార్పొరేషన్ ఖర్చు చేసే ప్రతి రూపాయికీ లెక్క ఉండాలి. పేపర్ల ద్వారానైనా, లేక పోర్టల్ రూపంలో అయినా నగరంలో ఎక్కడ ఎంత నిధులు ఖర్చవుతున్నాయో ప్రజలకు అందుబాటులో ఉండాలని



సూచించారు. మూడొందల మంది కాంట్రాక్టర్లు ఇప్పటికీ పోర్టల్‌లో నమోదు కాలేదు. కొందరికి ఆమోదం రాలేదు, ఇంకొందరికి బిల్లులు స్టేజీలోనే నిలిచిపోయాయన్నారు. ప్రజల డబ్బు ఎక్కడికి వెళ్తుందో,



తెలియాలని, మనం ప్రజలకు జవాబుదారితనంగా, ఉండాలని తదుపరి కౌన్సిల్ సమావేశానికి ముందే ఆదాయం, ఖర్చు, వర్కుల వివరాలను పూర్తి పారదర్శకతతో సభ ముందుంచాలని గళ్ళా మాధవి డిమాండ్ చేశారు.

# ఏపీ మద్యం కుంభకోణం.. కల్తీ మద్యం ఘటనల్లో కర్త..కర్మ..క్రియ..జగనే : మాజీమంత్రి ప్రత్తిపాటి




**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, అక్టోబర్ 23:**

చిలకలూరిపేట: రాష్ట్రాన్ని ఆవహించిన మద్యం రాక్షసిని పెంచి పోషించింది జగన్..వైసీపీయే. తన స్వార్థం కోసం ఐదేళ్లలో ఏపీని మద్యాంధ్రప్రదేశ్ గా మార్చిన జగన్... విషపూరిత మద్యాన్ని విచ్చలవిడిగా అమ్మించి వందలమందిని పొట్టనపెట్టుకున్న జగన్.. కూటమిప్రభుత్వం ప్రజాహితంతో, పారదర్శకంగా అమలుచేస్తున్న మద్యం విధానాన్ని విమర్శించడం హాస్యాస్పదం. మద్యం విక్రయాల్లో పారదర్శకత, కల్తీమద్యం కట్టడి, బెల్టు షాపుల నియంత్రణ కోసమే ప్రభుత్వం యాప్ ప్రవేశపెట్టింది. పారదర్శక మద్యం పాలసీలో భాగంగానే కూటమిప్రభుత్వం కల్తీమద్యం గుర్తింపునకు ప్రత్యేక యాప్ తీసుకొచ్చింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ "ఏపిటిఏటిఎస్" మరియు "ఎక్సైజ్ సురక్షా" అనే విశేష యాప్‌లను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ప్రతి మద్యం బాటిల్‌పై ఉండే క్యూఆర్ కోడ్ ను యాప్ ద్వారా స్కాన్ చేస్తే తయారీ సంస్థ, తయారీ తేదీ, సంస్థ లైసెన్స్ వివరాలు సమాచారం కనిపిస్తుంది. దీనివల్ల నాణ్యమైన, కల్తీ మద్యం మధ్య తేడాలను తేలిగ్గా గుర్తించవచ్చు. మద్యం సరఫరాలో జరిగే అక్రమాలు..బెల్టు షాపుల విక్రయాలు గుర్తించి కట్టడి చేయడానికి యాప్ దోహదపడుతుంది. ఈ యాప్ పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం అనేకచర్యలు చేపట్టింది. ఎక్సైజ్ సిబ్బంది మద్యం దుకాణాల తనిఖీల్లో భాగంగా యాప్ పై మద్యపానప్రియులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ విధంగా జగన్ తన పాలనలో ప్రజారోగ్యాన్ని రక్షించేలా మద్యం అమ్మకాలు నిబద్ధతగా ఎందుకు జరపలేదో సమాధానం చెప్పాలి. క్విడ్ ప్రోకో.. సూట్ కేస్ కంపెనీలతో లక్షలకోట్లు దిగమింగిన ఆర్థిక నేరస్తుడికి.. మద్యం సీసాలపై ముద్రించే క్యూఆర్ కోడ్ లు మార్చడం చాలా చిన్నవిషయమనేది ప్రజల భావన తమ హాయాంలో క్యూ ఆర్ కోడ్ లు స్కాన్ చేసే విధానం ప్రవేశపెట్టామని, నకిలీ మద్యం లేకుండా చే శామంటున్న జగన్ మాటలన్నీ పచ్చిబూటకాలే. డిస్టిలరీల్లోనే కల్తీమద్యం తయారుచేయించి హాలోగ్రామ్ స్టిక్కర్లు అంటించి, నేరుగా మద్యం దుకాణాలకు సరఫరా చేయించి. అధికధరకు అమ్మి, అమాయకుల్ని బలి తీసుకున్న పాపం జగన్ దే. సూట్ కేస్ కంపెనీలు.. క్విడ్ ప్రోకో విధానాలతో లక్షలకోట్లు దిగమింగిన ఆర్థిక నేరస్తుడికి, మద్యం సీసాలపై ముద్రించే కోడ్ లు మార్చడం.... చాలా చిన్న విషయమని ప్రజలు బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. జగన్ తన పాలనలో రాష్ట్రాన్ని విషపూరిత మద్యం.. గంజాయి..డ్రగ్స్ కు కేరాఫ్ అడ్రస్ గా మారిస్తే.. చంద్రబాబు తన అనుభవం. సమర్థత.. విజన్ తో రాష్ట్రాన్ని అభివృద్ధి.. ప్రజాసంక్షేమంలో ప్రపంచానికే ఆదర్శంగా నిలిపే కృషి చేస్తున్నారు. 2019-24 మధ్య వెలుగుచూసిన మద్యం కుంభకోణం, ఇటీవలి కల్తీమద్యం ఘటనల్లో కర్త..కర్మ..క్రియ సర్వం జగన్ మోహన్ రెడ్డే. ఈ నిజం ప్రజలు గ్రహించారు కాబట్టే... మద్యం అమ్మకాల సొమ్ముతో మళ్లీ అధికారంలోకి రావాలన్న జగన్ కలల్ని కల్లలు చేసి శాశ్వతంగా ప్యాలెస్ లకు పరిమితం చేశారు. విషప్రచారం..విమర్శలతో చంద్రబాబు ప్రభుత్వ పనితీరుని తప్పుపట్టాలనే జగన్ కుటిల యత్నాలు.. వైసీపీ నేతల పన్నాగాలను ప్రజలు తప్పక ఛీ కొడతారు." అని మాజీమంత్రి ప్రత్తిపాటి ఒక ప్రకటనలో స్పష్టంచేశారు.

# విగ్రహం ధ్వంసం చేసిన చోటే మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహంపెట్టాలిముఖ్యమంత్రిని కోరుతున్నారు -రాచకొండ లక్ష్మయ్య...





**పెన్ పవర్, గుంటూరు, అక్టోబర్, 23.**

వరంగల్ తూర్పు నియోజకవర్గం అండర్ రైల్వే గేట్ ప్రాంతంలో ఉర్సు దర్గా దగ్గరలో ఉన్న బడుగు బలహీన వర్గాల బీసీల ముద్దుబిడ్డ బీసీల కోసం పోరాటాలు చేసిన మహాత్ముడు మహనీయుడు మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ధ్వంసం చేయడం జరిగింది, తీవ్రంగా ఖండిస్తూ ఈరోజు తెలుగుదేశం పార్టీ జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి లక్ష్మయ్య మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహ ధ్వంసం అయిన ప్రాంతాన్ని సందర్శించి గతంలో కూడా విగ్రహం పై దాడి జరిగిందని విధ్వంసానికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని బీసీల ఆరాధ్య దైవం దైవమైనటువంటి మహాత్మ జ్యోతిరావు పూలే ధంసమైన స్థలాన్ని స్థానిక ఎమ్మెల్యే మంత్రి గా ఉన్న కొండా సురేఖ పరిశీలించి తక్షణమే ప్రభుత్వ ఖర్చులతో మహాత్మ జ్యోతిరావు పూలే నిలువెత్తు విగ్రహాన్ని యధా స్థానంలో నిర్మించాలని ప్రభుత్వాన్ని పత్రికా ముఖంగా కోరడం జరుగుతోందని విగ్రహ ధ్వంసమైన ఆయన చోటా రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్ర బీసీ మంత్రులు రాష్ట్ర అధ్యక్షులు మేలుకొని విగ్రహాన్ని ధ్వంసం చేసిన చోటే మళ్లీ విగ్రహం పెట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కోరుతున్నానని తెలుగుదేశం పార్టీ జిల్లా పిసిసి అధికార ప్రతినిధి లక్ష్మయ్య తెలిపారు.

## ఆర్టీసీ డ్రైవర్ పై గుర్తుతెలియని యువకులు దాడి

**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, అక్టోబర్ 23:**

చిలకలూరిపేట: గురువారం ఆర్టీసీ బస్సు డ్రైవర్ పై గుర్తుతెలియని యువకులు దాడి చేసిన సంఘటన పట్టణంలోని ఎన్ ఆర్ టి సెంటర్ వద్ద జరిగింది. తిరుపతి నుంచి సత్తెనపల్లి వెళ్తున్న ఆర్టీసీ డిపో డ్రైవర్ శ్రీనివాసరావు టీ తాగేందుకు ఎన్ ఆర్ టి సెంటర్‌లో ఆగారు.టీ స్టాల్ వద్ద డ్రైవర్ శ్రీనివాసరావుకు, కొందరు యువకులకు మధ్య జరిగిన గొడవ తీవ్రమైంది. ఈ గొడవలో యువకులు డ్రైవర్ శ్రీనివాసరావు పై దాడి చేయగా, ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి.వెంటనే శ్రీనివాసరావును ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం డ్రైవర్ పోలీసు స్టేషన్‌లో జరిగిన సంఘటనపై ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.



## నూతన కల్చరల్ కమిటీని అభినందించిన.. ఎమ్మెల్యే నసీర్..



**పెన్ పవర్, గుంటూరు, అక్టోబర్, 23.**

రాష్ట్రంలో కళలను అత్యంత ప్రోత్సాహం అంస్తున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ లెజిస్లేటివ్, వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గం కల్చరల్ నూతన కమిటీని గురువారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కళాకారులకు పుట్టినిల్లని తెలిపారు. కళలను ప్రోత్సహించడంలో సీఎం చంద్రబాబు నాయుడు ముందుంటారని తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో కళాకారులకు తాము అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. కల్చరల్ కమిటీ నూతన అధ్యక్షుడుగా డీ వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ గా కె సురేష్, జనరల్ సెక్రటరీలుగా బి బాల సుబ్రహ్మణ్య చారి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి విజయ కుమారి, డి పూర్ణచంద్ర శాస్త్రి, సెక్రటరీలుగా వై కిషోర్ శర్మ, సిహెచ్ మీనా కుమారి, అఫీషియల్ స్పోకెన్ పర్సన్ గా డి మనోజ్ఞ, సోషల్ మీడియా కోఆర్డినేటర్ గా వి మల్లికార్జున చారి నియమితులయ్యారు.

## ఎడ్లపాడు మండలంలో ప్రత్యేక ఆధార్ శిబిరాలు ప్రారంభం





**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, అక్టోబర్ 23:**

ఎడ్లపాడు: మండల పరిధిలోని 0 నుండి 6 సంవత్సరాల లోపు ఆధార్ కార్డు లేని పిల్లలకు, అలాగే 6 నుండి 15 సంవత్సరాల వయస్సు కలిగిన విద్యార్థులకు నూతన ఆధార్ కార్డులు జారీ చేయడం, ఇంకా హైస్కూల్ మరియు ఇతర విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల పెండింగ్‌లో ఉన్న మండేటరీ బయోమెట్రిక్ అప్డేషన్ (ఎంబియు) వంటి సేవలను పూర్తిచేయడానికి ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేశారు.ఈ ప్రత్యేక శిబిరాలు అక్టోబర్ 23 నుండి 30వ తేదీ వరకు నారాయణ స్కూల్ మరియు సెయింట్ ఆన్స్ స్కూల్ ప్రాంగణాల్లో కొనసాగనున్నాయి. ఆధార్ సంబంధిత అన్ని సేవలు ఈ శిబిరాల్లో అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జాలాది గ్రామ డిజిటల్ అసిస్టెంట్ శేఖ్ రఫీ, చంగీస్ ఖాన్ పేట డిజిటల్ అసిస్టెంట్ డి. సుధాకర్ పాల్గొననున్నారు.

# 24న ఎమ్మెల్యే ఏలూరి టూర్ షెడ్యూల్



**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు పెన్ పవర్ అక్టోబర్ 23**

శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు ఈ నెల 24 వ తేదీన మార్టూరు, ఇంకొల్లు, చిన్నగంజాం మండలాల్లో పర్యటించనున్నారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన,ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉదయం 11.00 గంటలకు మార్టూరులో కార్తీక్ హాస్పిటల్ ( కేఎస్ఆర్ ) ప్రారంభోత్సవంలో పాల్గొనడంతో పాటు ఉదయం 11:30 గంటలకు మార్టూరు ఎంపీడీవో కార్యాలయంలో హౌసింగ్ పై సమీక్ష నిర్వహిస్తారు. ుమధ్యాహ్నం 12 గంటలకు ఎమ్మెల్యే ఏలూరి క్యాంప్ కార్యాలయంలో 103 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేస్తారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి నాగండ్ల ు పావులూరు రహదారిని పరిశీలిస్తారు. మధ్యాహ్నం 3.00 గంటలకు ఇంకొల్లు ఎంపీడీవో కార్యాలయంలో హౌసింగ్ పై సమీక్ష సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు చిన్నగంజాం ఎంపీడీవో కార్యాలయంలో హౌసింగ్ పై సమీక్ష సమావేశంలో పాల్గొంటారు. అనంతరం చిన్నగంజాంలోని వెంకటేశ్వర కళ్యాణ మండపంలో ఉపాధ్యాయుడు సిద్ధం పాపారావు వివాహ వేడుకలో పాల్గొంటారు. ఆ రాత్రి 10 గంటలకు గుంటూరులో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి తనయుడు వివాహ వేడుకకు హాజరవుతారు.

# రేగులచెలకలో భూ సమస్యల పరిష్కారానికి గ్రామసభ

**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 23**

మండలంలోని రేగులచెలక గ్రామ సచివాలయంలో గురువారం భూ సమస్యల పరిష్కారానికి జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామ రెవెన్యూ అధికారి షరీఫ్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ పరిధిలో మొత్తం 123 మంది రైతులు తమ భూములకు సంబంధించిన ఆధారాలతో అర్జీలు సమర్పించారని తెలిపారు. రైతులు అందజేసిన పత్రాలను పూర్తిగా పరిశీలించి సమగ్ర నివేదికను జాయింట్ కలెక్టర్ కార్యాలయానికి పంపిస్తామని చెప్పారు. జాయింట్ కలెక్టర్ సూచనల మేరకు డిస్ప్యూట్ రిజిస్టర్లో నమోదైన భూములను తొలగించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని గ్రామ రెవెన్యూ అధికారి షరీఫ్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బత్తుల వెంకట్, కుక్కా తిరుపతయ్య, మాజీ ఎంపీటీసీ తులాబందుల ఈశ్వరయ్య, దర్శిగుంట ఆదినారాయణ, గ్రామంలోని రైతులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు


# ప్రభాస్ వ్యక్తిత్వం యువతకు ఆదర్శనీయం...

**జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి..**

**పెన్ పవర్, గుంటూరు, అక్టోబర్, 23.**

భారతీయ సినిమాకు గ్లోబల్ స్థాయి గుర్తింపు తెచ్చిన తొలి తెలుగు సినీ నటుడు ప్రభాస్ అని జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. సినీ పరిశ్రమను అంతర్జాతీయ స్థాయిలోకి తీసుకెళ్లి తెలుగు వాడి సత్తా ఏంటో ప్రభాస్ మరోసారి ప్రపంచానికి చాటి చెప్పారని కొనియాడారు. గురువారం రెబల్ స్టార్ ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా శ్రీనివాసరావుతోటలోని జనసేన కార్యాలయంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండే ప్రభాస్ వ్యక్తిత్వం నేటి యువతకు ఆదర్శనీయం అన్నారు. పెదనాన్న కృష్ణంరాజు వారసత్వాన్ని కొనసాగిస్తూనే సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని పొందారన్నారు. తను నటించే ప్రతీ సినిమాను మొదటి సినిమాగా భావిస్తూ కష్టపడటమే ప్రభాస్ విజయాల రహస్యమన్నారు. ప్రభాస్ తన పాత్రల్లో పరకాయ ప్రవేశం చేసి, తనకు మాత్రమే సొంతమైన నటనతో అభిమానుల్ని , ప్రేక్షకుల్ని మంత్ర ముగ్దుల్ని చేస్తున్నాడని ఆళ్ళ హరి అన్నారు. కార్యక్రమంలో వీరమహిళ రామిశెట్టి ధరణి , నాజర్ వలి , వడ్డే సుబ్బారావు , నందూరి స్వామి , బద్రి , స్టూడియో బాలాజీ , జక్కా రాఘవులు , బీజేపీ మండల కార్యదర్శి తోట గోపి తదితరులు పాల్గొన్నారు.





# ప్రమాదకరంగా మారిన అల్లినగరం బీసీ హాస్టల్ భవనాలను పరిశీలించిన మండల అధికారులు

**పురాతన భవనాలను తక్షణమే ఖాళీ చేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించిన ఎంపీడీవో ఎస్ సత్యం ,డిప్యూటీ ఎంపీడీవో చెన్నారావు.**







**కొమరోలు పెన్ పవర్ అక్టోబర్ 23**

కొమరోలు మండలం అల్లినగరంలో ప్రమాదకరంగా మారి ఉన్న వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహ భవనాలను గురువారం కొమరోలు ఎంపీడీవో సాని కొమ్ము సత్యం ,డిప్యూటీ ఎంపీడీవో జై సిహెచ్ చెన్నారావు సందర్శించి పరిశీలించారు. అల్లినగరంలోని బీసీ బాలుర హాస్టల్ ను రెండు వేర్వేరు పురాతన భవనాలలో నిర్వహిస్తున్నారు . ఆర్ఎంబి రోడ్డు పక్కన గల రెండు పోర్షన్లు గల పురాతన భవనంలో విద్యార్థుల కొరకు ఉదయం సాయంత్రం వంట తయారు చేయడమే కాకుండా అక్కడే విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్నారు .అయితే సదరు భవనం గోడలు దెబ్బతిని ప్రమాదకరంగా ఉన్నట్లుగా అధికారులు గుర్తించారు. అలాగే వరండాను పరిశీలించగా పైకప్పు పూర్తిగా దెబ్బతిని వర్షపు నీరు దంతెల నుంచి నేలపై పరిచిన నాపరాళ్లపై పడి వరండా అంత బురదమయంగా మారినట్లుగా వారు గుర్తించారు . సదరు భవనానం పైకప్పుకు గతంలో కలప దంతెలు వినియోగించినందువల్ల సదరు దంతెలు వర్షానికి తడిసి దెబ్బతిని ఉన్నట్లుగా గుర్తించారు. భవనం లోపలికి వెళ్లి గదులను పరిశీలించేందుకు ప్రయత్నించగా గదులు తలుపులకు తాళాలు వేసి ఉన్నారు .విద్యార్థులు చదువుకోవడానికి ,కాలకృత్యాలు తీర్చుకోవడానికి, స్నానం చేయడానికి, రాత్రివేళ నిద్రించుటకు ఏర్పాటుచేసిన మూడు పోర్షన్లు గల రెండవ భవనాన్ని కూడా అధికారులు సందర్శించి పరిశీలించారు. సదరు భవనంలోనికి వెళ్లేందుకు తాళాలు వేసి ఉన్నందువల్ల బయట నుంచి పరిశీలించారు. భవనం బయట పై భాగంలో సిమెంటు కాంక్రీటు దిమ్మెలు వేలాడుతూ కనిపించాయి. అవి ఏ సమయంలోనైనా కింద పడుటకు సిద్ధంగా ఉన్నట్లుగా వారు గుర్తించి ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాక పై కప్పుకు వేసిన కాంక్రీటు కూడా దెబ్బతిన్నట్టుగా గుర్తించారు. గిద్దలూరు లో ఉన్న అల్లినగరం బీసీ హాస్టల్ వార్డెన్ శ్రీనివాసులు కు ఫోన్ చేసి ఎంపీడీవో మాట్లాడారు .హాస్టల్ కు ఏర్పాటు చేసిన రెండు భవనాలు పూర్తిగా శిథిలావస్థలో ప్రమాదకర స్థితిలో ఉన్నాయని, వాటిపై కప్పులు గోడలు ఏ సమయంలోనైనా కూలిపోయే ప్రమాదం ఉన్నదని అలాంటి భవనాలలో హాస్టల్ ఎలా నిర్వహిస్తున్నారని వార్డెన్ ను ప్రశ్నించారు. తాము హాస్టల్ ను సందర్శించిన సమయంలో వార్డెన్ లేదా వాచ్మెన్ అందుబాటులో లేకపోవడంపై అధికారులు అసహనం వ్యక్తం చేసి సదరు విషయాన్ని వార్డెన్ కు వివరించారు. తాను అల్లినగరం హాస్టల్ కు రెగ్యులర్ వార్డెన్ గాను, గిద్దలూరు లోని బీసీ బాలుర కళాశాల హాస్టల్ కు ఎఫ్ఎసి వార్డెన్ గా విధులు నిర్వహిస్తున్నానని చెప్పారు. అయితే రెగ్యులర్ హాస్టల్ ను నిర్లక్ష్యం చేయడం తగదని అంటూ శిధిలావస్థలో ప్రమాదకరంగా ఉన్న భవనాలను తక్షణమే ఖాళీ చేసి విద్యార్థులకు అనుకూలంగా ఉండే మరో భవనాలలో హాస్టల్ నిర్వహించేందుకు సత్వర చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో వార్డెన్ శ్రీనివాసులును ఆదేశించారు. అనంతరం అల్లినగరం జిల్లా పరిషత్ హై స్కూల్ ను సందర్శించి హాస్టల్ నిర్వహణకు హై స్కూల్లో ఖాళీగా ఉంటున్న తరగతి గదుల గురించి ఆ పాఠశాల హెడ్మాస్టర్ మామిడి పద్మజ తో చర్చించారు .హై స్కూల్లో రెండు తరగతి గదులు ఖాళీగా ఉంటున్నాయని, అయితే సదరు రెండు తరగతి గదులు పైకప్పులు వర్షాలకు లీక్ అవుతున్నాయని ఆమె అధికారులకు వివరించారు. దీనితో అదనపు తరగతి గదులపై అంతస్తులో నిర్మాణంలో ఉన్న రెండు తరగతి గదులను ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో పరిశీలించారు. సదరు రెండు తరగతి గదుల నిర్మాణాలు అర్థాంతరంగా నిలిచి ఉన్నాయని ,అంతేకాక వాటి నిర్మాణాలను పూర్తి చేసేందుకు మరో 5 లక్షలు వరకు ఖర్చు అవుతుందని ప్రధానోపాధ్యాయురాలు పద్మజ వివరించారు. అంతేకాక హాస్టల్ నిర్వహణకు సదులు రెండు తరగతి గదులు అనుకూలంగా లేవని అధికారులు గుర్తించారు. వచ్చే వారంలో రెండు రోజులపాటు అల్లినగరం గ్రామంలో పర్యటించి హాస్టల్ నిర్వహణకు ప్రత్యామ్నాయ భవనాలను గుర్తిస్తామని ఎంపీడీవో సత్యం ,డిప్యూటీ ఎంపీడీవో చెన్నారావు తెలిపారు. అధికారులు హైస్కూల్ లోని గదులను పరిశీలిస్తున్న సమయంలో హాస్టల్ వాచ్మెన్ రాజయ్య వచ్చి అధికారులతో కలిసి హాస్టల్ పరిస్థితి గురించి వివరించారు. హాస్టల్ కు ప్రత్యామ్నాయ భవనాల కొరకు తాను, వార్డెన్ గ్రామంలో పరిశీలించామని తెలిపారు. ఆ కార్యక్రమంలో అల్లినగరం గ్రామ సచివాలయ కార్యదర్శి పోతుగంటి దస్తగిరి ,ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఆఫ్రిద్ ,హై స్కూల్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి మండల అధ్యక్షులు కృషి చేయాలి

**టీడీపీ నియోజకవర్గఇంచార్జి గూడూరి ఏరిక్షన్ బాబు**





**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ అక్టోబర్ 23**

రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ పథకాలను అమలుచేసి, రాష్ట్రాభివృద్ధికోసం శ్రమిస్తున్నా ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడుకు మద్దతుగా, నూతనంగా ఎన్నికైన పార్టీ మండల అధ్యక్షులు కృషి చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబు అన్నారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయం ప్రకటించిన అయిదు మండలాలలో నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షులకు ఆయన నియామక పత్రాలను అందజేసి సత్కరించారు. యర్రగొండపాలెం మండల పార్టీ అధ్యక్షులుగా చిట్యాల వెంగళరెడ్డి, దోర్నాల మండల పార్టీ అధ్యక్షులు గా షేక్ మాబు, పుల్లలచెరువు మండల పార్టీ అధ్యక్షులుగా పొట్ల గోవిందు, త్రిపురాంతకం మండల పార్టీ అధ్యక్షులు గా మేకల వలరాజు యాదవ్, పెద్దారవీడు మండల పార్టీ అధ్యక్షులు గా మెట్టు శ్రీనివాస్ రెడ్డి, లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబు మాట్లాడుతూ ఇన్నాళ్లు పార్టీకోసం శ్రమించిన నాయకులను పార్టీ అధిష్టానం గుర్తించిందని, అందుకే పార్టీ పదవులు ఇచ్చి గౌరవించిందని అన్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గం లో మండల అధ్యక్షులు గా ఎన్నికైన వారు నేటి నుంచి బాధ్యత తో పార్జి బలోపేతం చేయడానికి, అందరితో కలిసి కృషి చేయాలన్నారు. వైస్సార్సీపీ కుట్రలను త్రిప్పికొడుతూ చంద్రన్న రాష్ట్రంలో చేపట్టిన పథకాలు ప్రజల ముందుకు తీసుకెళ్లి వివరించాలని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ జెండా అన్ని పంచాయితీ లలో గెలుపు జెండా ఎగురావేయాలని ఆదేశించారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వానికి అందరు సైనికులుగా పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కె యార్డ్ చైర్మన్ చేకూరి సుబ్బారావు, సీనియర్ నాయకులు బోగోలు సుబ్బారెడ్డి, శనగ నారాయణ రెడ్డి,కాకర్ల కోటయ్య, వేగినాటి శ్రీనివాస్,కందుల వెంకట రెడ్డి, షేక్ మస్తాన్ వలి, సయ్యద్ మాలిక్,తదితరులు పాల్గొన్నారు.

# చదలపాడు రామన్న చెరువు గట్టును పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాజాబాబు

**- గట్టుపటిష్టతకు చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు హామీ**





**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ అక్టోబర్ 23**

భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ తో కలసి గురువారం సాయంత్రం నాగులుప్పలపాడు మండలం, చదలవాడ గ్రామాన్ని సందర్శించి, చదలవాడ రామన్న చెరువు గట్టు దెబ్బతిన్న ప్రదేశాన్ని పరిశీలించారు. చెరువులోని నీరు ఒంగోలు – చీరాల జాతీయ రహదారి పైకి రాకుండా ఉన్న సైడు కాలువ ద్వారా వెళ్ళేలా వెంటనే అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, నేషనల్ హై వే అధారిటి, ఇరిగేషన్ శాఖ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే సైడు కాలువలో నిలిచి ఉన్న నీటిని తొలగించి, గుండ్లకమ్మ వాగు వైపు నీటిని సరైన విధంగా మళ్లించాలని జిల్లా కలెక్టర్, అధికారులను ఆదేశించారు. నేషనల్ హై వే అధారిటి ఇంజనీరింగ్ అధికారులు వెంటనే జేసిబి ఉపయోగించి పనులను ప్రారంభించారు. చెరువు కట్టను పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని, భారీ వర్షాలు పడిన ప్రతిసారి ఇదే సమస్య వస్తున్నదని, శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు ఈ సందర్భంగా కలెక్టర్ ను కోరారు. జిల్లా కలెక్టర్ స్పందిస్తూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట ఆర్ డి ఓ లక్ష్మీ ప్రసన్న, ఇరిగేషన్ ఎస్ ఈ వరలక్ష్మి, డ్వామా పిడి జోసెఫ్ కుమార్, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కొమరోలు ప్రగతి కళాశాలలో పోలీసులు ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహణ.

**పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని కార్యక్రమాలు నిర్వహణ.**





**కొమరోలు పెన్ పవర్ అక్టోబర్ 23**

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని గురువారం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు కొమరోలు ఏఎస్ఐ మునాఫ్ ,హెడ్ కానిస్టేబుల్ షేక్ సలీం ఆధ్వర్యంలో కొమరోలు లోని ప్రగతి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సంఘ విద్రోహ శక్తుల నుంచి మహిళలు, బాలికలు రక్షణ పొందేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలు అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆ కళాశాల ప్రిన్సిపాల్ కందుల సందీప్ రెడ్డి అధ్యక్షులు వహించగా, ఏఎస్ఐ మునాఫ్, హెడ్ కానిస్టేబుల్ షేక్ సలీం పాల్గొని విద్యార్థులకు పోలీసు వ్యవస్థ పనితీరు, శాంతి భద్రతల పరిరక్షణకు, మహిళలు, బాలికలను కాపాడేందుకు తీసుకుంటున్న చర్యలు, ఆత్మరక్షణపై మహిళలు బాలికలు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించి అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి పర్యవేక్షించారు .ఈ నెల 31వ తేదీన పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేస్తామని ఏఎస్ఐ తెలిపారు .ఆ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు రాజేష్ రెడ్డి ,వీరభద్ర, మహిళా కానిస్టేబుల్ రాజ్యం ,తదితర పోలీసు సిబ్బంది, ప్రగతి కళాశాల అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

# సగిలేరు వాగు ఉధృతిని పరిశీలించిన తహశీల్దార్ ఆంజనేయ రెడ్డి






**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 23**

బంగాళాఖాతం లో ఏర్పడిన అల్పపీడనం తుఫాన్ కారణంగా నలమల్ల అటవీప్రాంతంలో కురిసిన భారీ వర్షాలు కురిశాయి . దీంతో నలమల్ల నుండి పలు వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఇందులో గిద్దలూరు నడి బొడ్డునుండి ప్రవహించే సగిలేరు వాగు ఉదృతంగా ప్రవహిస్తోంది. గిద్దలూరు మున్సిపాలిటీ లోని కొండపేట ఆంజనేయస్వామి అలయసమీపంలో సగిలేరు మరి ఉదృతంగా ప్రవస్తుంది. ఇటీవలనే ఒక 25 ఏండ్ల యువకుడు ఈత సరదా తో ఈతకు వెళ్లి సగిలేరు వాగుగుండాలో ఇరుక్కుని మృత్యువాత పడ్డాడు. దీన్ని దృష్టిలో ఉంచుకొని గిద్దలూరు తహాశిల్దార్ ఆంజనేయ రెడ్డి కొండపేట సగిలేరు వాగు వద్దకు వెళ్లి వాగు ప్రవాహాన్ని పరిశీలించారు .కాకుండా ప్రతాప్ రెడ్డి కాలనీ సమీపంలో సాగిలేరును పరిశీలించారు.వాగుఉదృతంగా ప్రవహిస్తోందని సగిలేరు పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహాశిల్దార్ కోరారు. తుఫాన్ కారణం దృష్ట్యా తాసిల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ప్రజలందరూ సహకరించాలని అధికారులు తాసిల్దార్ ఆంజనేయ రెడ్డి తెలియజేశారు. గురువారం ఉదయానికి రాచర్ల మండలంలో అత్యధికంగా85.4మీ మీ వర్షం నమోదుకాగా గిద్దలూరు లో28.6,మీమీల కోమరోలు లో 26.4 మీ మీ వర్షం కురిసింది. రాచర్ల మండలం జె పి చెరువు సమీపంలో నలమల్ల అతివిలో పవిత్ర పుణ్యక్షేత్రం నెమలిగుండ్ల రంగనాయక స్వామి చెంత గుండ్లకమ్మ కొండపై నుండి జలపాతం లా క్రిందకు దుముకుతూ ఉదృతంగా ప్రవహిస్తోంది. అక్కడకూడా పోలీసులు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు .అటువైపు ఎవ్వరు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఇది ఇలాఉండగా గిద్దలూరు లో సగిలేరు వాగుకు ఆవలి వైపు జగనన్న కాలనీ ఉంది. కానీ ఆకాలనీకి కొండపేట వద్ద సగిలేరు వాగు దాటి వెళ్లాల్సి ఉంది . కానీ వాగు ఉదృతంగా ఉండటంతో ఆమార్గాని గురువారం మూసివేశారు. దీంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు.

# రైతులను ఆదుకుంటాం

**దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే కందుల**





**మార్కాపురం ఆర్.సి ఇన్చార్జ్ పెన్ పవర్ అక్టోబర్ 23**

అకాల వర్షాలతో పత్తి,మిరప, కంది రైతులు నష్టపోయారని వారికి వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడుతో చర్చించి నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. గురువారం అకాల వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. మార్కాపురం మండలంలోని బోడపాడు గ్రామంలో స్థానిక నివాసాల మధ్య నిలిచి ఉన్న నీటిని రెవిన్యూ అధికారులతో కలసి పరిశీలించారు. గ్రామంలో వర్షపు నీరు నిలవకుండా ఏం చేయాలో అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మార్కాపురం చెరువుకు గుండ్లకమ్మ ద్వారా వచ్చే సప్లై ఛానల్ నుండి వర్షపు నీరు వస్తుండడంతో దానిని పరిశీలించారు. తక్షణమే నీరు లీక్ కాకుండా చూడాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. అనంతరం మార్కాపురం మండలంలోని చింతకుంట గ్రామంలో అకాల వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలించారు.

# నేడు పామూరు పల్లి, మల్లారెడ్డిపల్లి ఫీడర్లలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత.

**ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం.**

**కొమరోలు, పెన్ పవర్ అక్టోబర్ 23**



కొమరోలు మండలంలోని రెడ్డి చర్ల సబ్ స్టేషన్ పరిధిలోని పామూరు పల్లె, మల్లారెడ్డిపల్లి ఫీడర్లలోని గ్రామాలకు ఈ నెల 24వ తేదీ న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయను న్నట్లుగా కొమరోలు విద్యుత్ శాఖ ఏఈ ఎం శ్రీనివాసులు తెలిపారు. పామూరు పల్లె ఫీడర్ లోని పామూరు పల్లె, మధవపల్లి గోనెపల్లి గ్రామాలలో, మల్లారెడ్డి పల్లె లీడర్ లోని మల్లారెడ్డిపల్లి ,బ్రాహ్మణపల్లి ,ఎర్ర పల్లి, బావాపురం, గ్రామాలలో ఆర్డీఎస్ఎస్ పథకం ద్వారా కొత్త లైన్లు ఏర్పాటు చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. ఆ కారణంగా ఈ నెల 24వ తేదీన ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయవలసి వస్తున్నదని ఆయన చెప్పారు. కావున ఆయా గ్రామాలలోని విద్యుత్ వినియోగదారులు సహకరించవలసిందిగా ఏఈ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు.

# రోడ్డు ప్రమాద బాధితుడికి 64వేలు ఆర్థిక సహాయం అందించి మానవత్వం చాటుకున్న వేస్సోట్రస్ట్

## అభినందించిన విశ్వబ్రాహ్మణ సంఘం

**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 23**



మానవత్వం ఇంకా సమాజంలో నిలిచి ఉందని నిరూపించే ఘటన చోటు చేసుకుంది కనిగిరి పట్టణానికి చెందిన మండా నరేంద్ర రోడ్ ప్రమాదంలో యాక్సిడెంట్ అయి తీవ్ర గాయాలు చెంది బ్రెయిన్ ఆపరేషన్ చేయించాలని డాక్టరు లు తెలుపగా మొదటి ఆపరేషన్ సక్సెస్ కాకపోవడంతో రెండవసారి బ్రెయిన్ ఆపరేషన్ ఆర్థిక స్తోమత లేక పోవడంతో కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి చొరవతో గుంటూరులోని అమరావతి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేయించారు ఆరోగ్యానికి సంబంధించిన ఖర్చులను భరించేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నరేంద్ర కుటుంబానికి ఆర్థిక సహాయము చేయాలని ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం తరపున జిల్లా అధ్యక్షులు చెన్నుపల్లి శ్రీనివాసచారి. ప్రధాన కార్యదర్శి కుందుర్తి సీతారామాంజనేయులు. కోశాధికారి రాచర్ల శేఖర్ లు హైదరాబాద్ కు చెందిన వేస్సో ట్రస్ట్ చైర్మన్ బంగారు తాతారావు సెక్రెటరీ బంగారు శ్రీనివాసరావు కు సమాచారం అందించగా అడిగిన వెంటనే స్పందించి వేస్సో ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతలు ద్వారా సేకరించి 64 వేల రూపాయల నగదును నరేంద్ర అమ్మ ఆదిలక్ష్మి అకౌంట్ కు పంపించారు అందుకు గాను వేస్సో ట్రస్ట్ చైర్మన్. బంగారు తాతారావు సెక్రెటరీ బంగారు శ్రీనివాసరావు వారి కార్యవర్గ సభ్యులకు మరియు విరాళాలు అందజేసిన దాతలు అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు. బాధ్యతగా సహకరించిన జిల్లా కమిటీ వారికి ధన్యవాదములు తెలియపరుస్తున్నామని ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షులు వడ్లమాని నారాయణచారి. వర్కింగ్ ప్రెసిడెంట్ దొడ్డోజు విశ్వనాథ చారి ప్రచార కార్యదర్శి నిమ్మకూరు మాల్యాద్రి ధన్యవాదాలు తెలిపారు.

# భారీ వర్షాలతో భారీ ఎత్తున పుట్టగొడుగుల అమ్మకాలు జోరు

## మండల ప్రజలకు దక్కని పుట్టగొడుగులు



**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 23**

మండల వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా రెండు రోజులుగా కురుస్తున్న భారీవర్షాల ప్రభావంతో తేమ వాతావరణం కారణంగా సహజ సిద్ధమైన నాటు పుట్టగొడుగులు పుట్టాయి పొలాలు, అటవీ ప్రాంతాలు తెల్లని పుట్టగొడుగులతో కళకళలాడుతూ అక్కడక్కడ పుట్టాయి ప్రకృతి ప్రసాదంగా లభించే ఈ నాటు పుట్టగొడుగులు ఇప్పుడు బంగారం లా మారాయి. సహజ సిద్ధమైన పొలాల నుంచి పుట్టగొడుగులు సేకరించి పట్టణాలకు తరలిస్తూ అమ్మకాలు సాగిస్తున్నారు.దాదాపు15 నుంచి 20 పుట్టగొడుగులు ఒక కట్ట కట్టి సుమారు 150 రూపాయలకు విజయవాడ, హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై వంటి ప్రధాన పట్టణాలకు సప్లై చేస్తున్నారు. పుట్టగొడుగుల డిమాండ్ పెరగడంతో వ్యాపారులు మంచి లాభాలు ఆర్జిస్తున్నారు అంతేకాకుండా ఒంగోలు నరసరావుపేట కందుకూరు కావలి నెల్లూరు సుదూరా ప్రాంతాలను చెందిన దళారులు సిఎస్పురం పామూరు ప్రాంతాల కు వచ్చి ఇక్కడ పుట్టగొడుగులు భారీగా తరలిస్తున్నారు దీంతో తమ ప్రాంతంలో తమ పొలాల్లో పండిన పుట్టగొడుగులు ఒక వర్గానికి చెందినవారు ఇతర ప్రాంతాలకు తరలించడంతో ఇక్కడ ప్రాంత ప్రజలకు పుట్టగొడుగులు దొరకపోవడంతో తీవ్ర నిరాశ చెందుతున్నారు ఆఖరికి మండల ప్రజలకు మాత్రం ఈ రుచికరమైన పుట్టగొడుగులు అందడం లేదు. మన ఊళ్ల పొలాల నుంచే పోతున్న పుట్టగొడుగులు మనకే దక్కడం లేదంటే దురదృష్టం కదా! అంటూ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకసారైనా ఈ నాటు పుట్టగొడుగుల రుచి చూడాలని ఆశపడుతున్నా, మార్కెట్లో దొరకక నిరాశ చెందుతున్నారు.పర్యావరణ సౌందర్యం మధ్య ప్రకృతి కానుకగా లభించిన ఈ పుట్టగొడుగులు ప్రస్తుతం మండలంలో చర్చనీయాంశంగా మారాయి. ఇక్కడి ప్రజలు అంత రేటు పెట్టి కొనలేకపోవడంతో ఇతర రాష్ట్రాలకు ఫోను ద్వారా వ్యాపారస్తులకు సమాచారం అందించి అమ్ముకుంటున్నట్లు ప్రజలు గుసగుసలు వినిపిస్తున్నాయి మండల ప్రజలు మాత్రం వాటి రుచిని ఆస్వాదించలేక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఎర్రగుంట్ల గ్రామంలో రోడ్లపై చేరిన మురుగునీరు తొలగింపు.

## అంటు వ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకున్న అల్లినగరం పంచాయతీ కార్యదర్శి దస్తగిరి.

**కొమరోలు పెన్ పవర్ అక్టోబర్ 23**

కొమరోలు మండలం అల్లినగరం గ్రామపంచాయతీ లోని ఎర్రగుంట్ల గ్రామంలోని వీధి రోడ్లపై చేరిన మురుగునీరును అల్లినగరం గ్రామ సచివాలయ కార్యదర్శి పోతుగంటి దస్తగిరి తొలగింపజేసి అంటు వ్యాధులు వ్యాపించకుండా తమ చర్యలు తీసుకున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఎర్రగుంట్ల గ్రామంలోని బీసీ కాలనీలోని రోడ్లపై వర్షపు నీటితో పాటు మురుగునీరు చేరింది. దీనితో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డారు.అంతేగాక మురుగునీరు వల్ల అంటూ వ్యాధులు వ్యాపిస్తాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు .సమాచారం అందుకున్న కొమరోలు ఎంపీడీవో ఎస్ సత్యం, డిప్యూటీ ఎంపీడీవో చెన్నారావు ఎర్రగుంట్ల గ్రామంలోని బీసీ రోడ్లపై చేరిన మురుగునీరును తొలగింప చేయుటకు సత్వర చర్యలు తీసుకోవాలని అల్లినగరం పంచాయతీ కార్యదర్శి దస్తగిరిని ఆదేశించారు. ఆ మేరకు దస్తగిరి ఆ గ్రామానికి వెళ్లి పారిశుద్ధ్య కార్మికుల సహకారంతో రోడ్లపై చేరిన మురుగునీటితో తొలగింపజేసి, అంటువ్యాధులు వ్యాపించకుండా



ఉండేందుకు ముందు జాగ్రత్తగా చర్యగా బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. దీనితో ఆ గ్రామ ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తూ, అధికారులకు, పంచాయతీ కార్యదర్శి కి ధన్యవాదాలు తెలిపారు.

# మాదకద్రవ్య రహితంగా సమాజాన్ని తీర్చిదిద్దాలి

**న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఇబ్రహీం షరీఫ్**




**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు పెన్ పవర్ అక్టోబర్ 23**

సమాజంలో ప్రతి ఒక్కరు ఉన్నతంగా, ఆరోగ్యంగా ఉండాలంటే మత్తు పదార్థాలకు ప్రత్యేకించి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్ అన్నారు. గురువారం నగరంలోని రాజీవ్ గాంధీ మెడికల్ కాలేజ్ నందు మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా, బాలబాలికలపై జరుగుతున్న లైంగిక దోపిడీ చట్టం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగిస్తూ పోక్సో యాక్ట్ ప్రకారం గరిష్టంగా శిక్షలు విధింపబడతాయని అటువంటి అనైతిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని అన్నారు. అదేవిధంగా మాదకద్రవ్యాలు వినియోగం గానీ రవాణా, అమ్మకాలు నిర్వహించడం ద్వారా వివిధ రకాలైన కఠినమైన శిక్షలు విధించబడతాయని ప్రత్యేకించి చదువుకునే యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్ కుమార్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ మమత డాక్టర్ సుబ్బారావు, కళాశాల పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, పోలీస్ శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

# స్పందనవిద్యాసంస్థలను వరించిన ప్రతిష్టాత్మక

**ఎడ్యుఐకాన్అవార్డు.**






**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 23**

స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ ఆధ్వర్యంలో నేడు విశాఖ నగరంలో నిర్వహించిన నేషనల్ ఎడ్యుకేషన్ ఈవెంట్ లో స్పందన విద్యాసంస్థలను ప్రతిష్టాత్మక ఎడ్యుఐకాన్ అవార్డు వరించింది ఈ అవార్డును స్పందన విద్యాసంస్థల డైరెక్టర్ పేర్ల.సుధీర్ కుమార్ రెడ్డి గురువారం విశాఖ లో విశాఖపట్నం ఎంపి, గీతం యూనివర్సిటీ అధినేత యం.భరత్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా సుధీర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యారంగంలో తాము చేస్తున్న కృషి వల్ల ఇలాంటి ప్రతిష్టాత్మక అవార్డులు తమ పాఠశాలకు లభించాయన్నారు . స్పందన విద్యాసంస్థలను ఎల్లపుడూ ఉత్తమంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ఈ అవార్డు సాధించడం తమకు గర్వకారణమన్నారు. ఇలాంటి అవార్డులు సాధించడానికి నిరంతర కృషి చేస్తున్న ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు, విద్యార్థినీ విద్యార్థులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# వర్మ షిఫ్టింగ్ తప్పదా

**కాకినాడ, అక్టోబరు 23, పెన్ పవర్: :** పిఠాపురం నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్.ఎన్. వర్మ రాజకీయ ప్రస్థానం ఎటూ అర్థం కాకుండా ఉంది. జనసేనాని పవన్ కల్యాణ్ కోసం తన స్థానాన్ని త్యాగం చేసిన వర్మకు ఇచ్చే ప్రాధాన్యత ఇదేనా? అన్న ప్రశ్న వర్మ వర్గీయుల నుంచి వినపడుతుంది. పిఠాపురం నియోజకవర్గాన్ని పవన్ కల్యాణ్ దాదాపు ఫిక్స్ చేసుకున్నట్లే కనపడుతుంది. పిఠాపురం నియోజకవర్గాన్ని పవన్ వదలిపెట్టే అవకాశం ఎంత మాత్రం లేదు. ఎందుకంటే పవన్ తన అడ్డాగా నియోజకవర్గాన్ని మార్చుకుంటున్నారు. నిజానికి పవన్ కల్యాణ్ ఎన్నికయిన తర్వాత ఈ నియోజకవర్గానికి కొంత ఇమేజ్ ఏర్పడింది. అక్కడ భూముల ధరలు కూడా పెరిగాయి. అదేసమయంలో అక్కడ ఓటు బ్యాంకు కూడా పవన్ అక్కడే ఫిక్స్ అయ్యేలా చేసేటట్లే కనపడుతుంది. మరి మాజీ ఎమ్మెల్యే వర్మ పరిస్థితి ఏంటన్నది మాత్రం ఎటూ తేలకుండా ఉంది. వర్మ పిఠాపురం నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన నేత కావడంతో పాటు టీడీపీలో కూడా కీలకమైన నేత. 2024 ఎన్నికలకు ముందు పవన్ కల్యాణ్ కోసం త్యాగం చేసినందుకు వర్మకు ఎమ్మెల్సీ పదవి ఇస్తానని అప్పుడే పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. కూటమి ధర్మంతో పాటు జగన్ ను ఓడించాలన్న లక్ష్యంతో వర్మ కూడా పవన్ కల్యాణ్ విజయానికి కృషి చేశారు. అంతవరకూ బాగానే ఉంది కానీ, కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత మాత్రం పిఠాపురం నియోజకవర్గంలో టీడీపీ, జనసేన స్థానిక నేతల మధ్య మాత్రం సఖ్యత లేదు. టీడీపీ నేతలను కట్టడి చేశామని చెప్పినప్పటికీ వర్మకు ఎలాంటి పదవి రాకపోవడం కొంత అసంతృప్తి వర్మ అనుచరుల్లో ఉంది.ఇక ఇటీవల మంత్రి నారాయణ చేసిన వ్యాఖ్యలపై కూడా వర్మ అనుచరులు గరంగరంగా ఉన్నారట. నారాయణ తాను ఆ మాట అనలేదని సర్ది చెప్పే ప్రయత్నం చేసినప్పటికీ వర్మను జీరో చేశామని టీడీపీ చెప్పడం వెనక ఇక భవిష్యత్ లో ఏ పదవి దక్కదని చెప్పకనే చెప్పినట్లయిందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. వర్మకు అక్కడ ఎమ్మెల్సీ పదవో మరే పదవి ఇచ్చినా పిఠాపురం నియోజకవర్గంలో మరో పవర్ సెంటర్ ఏర్పడుతుందని, అప్పుడు పవన్ కల్యాణ్ కు, తమకు గ్యాప్ ఏర్పడే అవకాశముందని పార్టీ నాయకత్వం వర్మకు భవిష్యత్ లోనూ ఏ పదవి దక్కే అవకాశముండకపోవచ్చని అంటున్నారు. మొత్తం మీద ఈ టర్మ్ లో మాత్రం వర్మ మాజీ ఎమ్మెల్యేగానే మిగిలిపోక తప్పదంటున్నారు.

# సొంత సామాజికవర్గంలోనే తప్పుతున్న పట్టు


**ఏలూరు, అక్టోబరు 24, పెన్ పవర్:** జనసేన అధినేత పవన్ కల్యాణ్ నీతి నిజాయితీల పట్ల ఎవరికీ అనుమానం లేదు. అదే సమయంలో ఆయన మౌనం కూడా పార్టీని డ్యామేజీ చేస్తుందంటున్నారు. ప్రభుత్వ నిర్ణయాల విషయాల్లో కానీ, కొన్ని సంఘటనలపై కానీ పవన్ కల్యాణ్ సరైన రీతిలో స్పందించకుండా సైలెంట్ గా ఉండటం ప్రధానంగా జనసేన పార్టీ నేతలు, క్యాడర్ లోనూ అంతకంటే ముఖ్యంగా కాపు సామాజికవర్గంలోనూ అసంతృప్తి ఉంది. ప్రశ్నిస్తానని పార్టీని పెట్టిన పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆ విషయాన్ని మరిచిపోయారన్న అభిప్రాయం ఎక్కువ మంది కాపు సంఘాల నేతలు కూడా వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో పవన్ వైఖరిని ప్రశ్నిస్తూ పోస్టులు పెడుతున్నారు.. కానీ పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారు. కూటమి ప్రభుత్వంలో ఆయన భాగస్వామి. ఆయనే ప్రశ్నిస్తే ప్రభుత్వానికి ఇబ్బందులు ఎదురవుతాయి. అదే సమయంలో కొన్ని కేసులకు సంబంధించి ప్రభావం చూపే అవకాశముంది. అయితే పవన్ కల్యాణ్ మాత్రం అంతర్గత సంభాషణల్లో రాష్ట్రంలో శాంతి భద్రతలు అంత బాగా లేవన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఎక్కువగా అత్యాచారాలు, హత్యలు జరుగుతుండటం పట్ల ఆయన కలత చెందినట్లు పార్టీకి చెందిన ముఖ్య నేతలు చెబుతున్నారు. గతంలోనే హోం మంత్రి పదవిని తాను తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించిన పవన్ కల్యాణ్ తర్వాత పదుల సంఖ్యలో జరిగిన సంఘటనలపై మాత్రం బాహాటంగా స్పందించకపోవడాన్ని కాపు సంఘం నేతలు ప్రశ్నిస్తున్నారు... అయితే పవన్ కల్యాణ్ కేవలం తాను కాపు సామాజికవర్గానికి సంబంధించిన నేతను కాదని, అన్నివర్గాలకు చెందిన నేతనని గుర్తు చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయాలను కొన్నింటిని మంత్రి వర్గ సమావేశంలో ప్రశ్నిస్తున్నారని, కానీ బహిరంగంగా మాట్లాడే అవకాశం ఆయనకు ఇప్పుడు ఉండదని పార్టీ నేతలు చెబుతున్నారు. అయినా ఎప్పటికప్పుడు అన్యాయం జరిగితే వెంటనే స్పందిస్తున్నారని, అందుకు ఉదాహరణ భీమవరం డీఎస్పీ జయసూర్యపై చంద్రబాబుకు ఫిర్యాదు చేశారని ఉదహరిస్తున్నారు. సివిల్ వ్యవహారాల్లో తలదూరుస్తున్నారని, వెంటనే అతనిపై చర్యలు తీసుకోవాలని మంత్రి నాదెండ్ల ద్వారా చంద్రబాబుకు సమాచారం అందించారని అంటున్నారు. అయినా సరే పవన్ కల్యాణ్ మాత్రం ఇంతకు ముందులా ఫోర్స్ గా లేకపోవడం, అన్యాయాన్ని ప్రశ్నించకపోవడంపై సొంత పార్టీ నేతలతో పాటు కాపు సామాజికవర్గం నుంచి కూడా విమర్శలను ఎదుర్కొనాల్సి వస్తుంది.

# పవన్ వర్సెస్ ఆర్ ఆర్ ఆర్

**భీమవరం, అక్టోబరు 23, పెన్ పవర్:**ఏపీలోఒక అంశం హాట్ టాపిక్ అవుతోంది. నిన్న రోజంతా భీమవరం డిఎస్పి జయ సూర్య వార్తల్లో నిలిచారు. ఆయన విషయంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించడం ఈ ప్రచారానికి కారణం. కూటమినేతల పేర్లు చెప్పుకొని అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారంటూ డీఎస్పీ జయ సూర్య పై అనేక రకాల ఫిర్యాదులు వచ్చాయి. భీమవరం పరిధిలో పేకాట శిబిరాలకు అండగా నిలుస్తున్నారని.. సివిల్ కేసుల్లో తల దూర్చుతున్నారని ఆయనపై వచ్చిన ఆరోపణలపై నివేదిక ఇవ్వాలని పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ ని ఆదేశించారు డిప్యూటీ సీఎం. ఇదే విషయాన్ని హోం శాఖ మంత్రితో పాటు బిజెపి కార్యాలయానికి సైతం సమాచారం అందించాలని పవన్ డిప్యూటీ కార్యాలయ అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది. అప్పటినుంచి ఇది హాట్ టాపిక్ గా మారింది. అయితే తాజాగా ఈ అంశంపై మాట్లాడారు ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణం రాజు.గన్నవరం డిఎస్పీగా ఉండేవారు జయసూర్య. అప్పట్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్ల విధేయత ప్రదర్శించే వారని ఆయన పై ఆరోపణలు ఉన్నాయి. ఓ కూటమి ఎమ్మెల్యే మద్దతుతో ఆయన భీమవరం లో పోస్టింగ్ ఇప్పించుకున్నారని కూడా టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం ఆ డీఎస్పీని ఓ కూటమి ఎమ్మెల్యే అండదండగా నిలుస్తున్నారని ఒక టాక్ అయితే ఉంది. సరిగ్గా ఇదే సమయంలో రఘురామకృష్ణంరాజు స్పందించడం గమనార్హం. మరోవైపు పవన్ కళ్యాణ్ ఫిర్యాదుతో సీఎం చంద్రబాబు సైతం ఈ విషయాన్ని సీరియస్గా తీసుకున్నారు. దీనిపై నివేదిక ఇవ్వాలని డిజిపి హరీష్ కుమార్ గుప్తాను ఆదేశించారు. మరోవైపు హోం మంత్రిత్వ శాఖ విషయంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జోక్యం ఏమిటి అన్న ప్రశ్న వస్తోంది. ఆయన కేవలం హోదా ప్రకారమే డిప్యూటీ సీఎం కానీ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయాలు ఫైనల్ అని.. మరి పవన్ కళ్యాణ్ ఎలా స్పందిస్తున్నారని విలేకరులు హోంమంత్రి వంగలపూడి అనితను ప్రశ్నించారు. దీనిపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. మాది ఎన్డీఏ ప్రభుత్వమని.. అంతా సమాచారం తమ వద్ద ఉందని.. శాఖల మధ్య సమన్వయం కొనసాగుతోందని చెప్పారు.తాజాగా దీనిపై స్పందించారు ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు. భీమవరం డిఎస్పీకి మంచి ట్రాక్ రికార్డు ఉందన్నారు. తనకున్న సమాచారం ప్రకారం జిల్లాలో పేకాట పై ఆయన నిఘా పుట్టారని.. అందుకే ఆయనపై అభియోగాలు వస్తున్నాయని అనుకుంటున్నాట్లు తెలిపారు. తన నియోజకవర్గం నుండి పరిధిలో ఎలాంటి పేకాట స్థావరాలు లేవని.. జూదం పై కూటమి ప్రభుత్వం ఉక్కు పాదం మోపుతోందని తెలిపారు. తద్వారా రఘురామకృష్ణం రాజు భీమవరం డిఎస్పి కి క్లీన్ చీట్ ఇచ్చినట్లు అయింది. ఈ పరిణామం ఎలాంటి పరిస్థితులకు దారితీస్తుందో చూడాలి

# సిగినాపల్లి రంగురాళ్ల క్వారీలో తవ్వకాలు నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులు అరెస్టు:

**ఆటవీశాఖ రేంజ్ అధికారి ప్రశాంతి కుమారి**



**గూడెం కొత్త వీధి, పెన్ పవర్ అక్టోబరు 23 :** జీకే వీధి మండలం సిగినాపల్లి రంగురాళ్ల క్వారీలో తవ్వకాలు నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు పెదవలస ఇన్చార్జి రేంజ్ అధికారి కె: ప్రశాంతి కుమారి తెలిపారు. గురువారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లా డుతూ సిగినాపల్లి రంగురాళ్ల క్వారీలో తవ్వకాలను కట్టడి చేసేందుకు అదనపు సిబ్బందితో గస్తీ నిర్వహి స్తున్నామన్నారు. బేస్ క్యాంప్, స్ట్రైకింగ్ పోర్సు సిబ్బందితో గస్తీ నిర్వహిస్తున్నామన్నారు. క్వారీ ప్రాంతంలో 144సెక్షన్ అమలు చేయడం జరిగిందన్నారు. తాజాగా క్వారీలో తవ్వకాలకు ప్రయత్నించిన గోతులను సమ్మెంట్ కాంక్రీట్తో పూడ్చివేశామన్నారు. అయితే కొత్తపాలెం గ్రామానికి చెందిన గెమ్మెలి చిట్టిబాబు. రకొండ గ్రామానికి చెందిన భీమవరం గణేశ్, బూదరాళ్ల గ్రామానికి చెందిన ఉప్పల బాలాజీలు కొండపైన తవ్వకాలు నిర్వహిస్తూ అటవీశాఖ సిబ్బందికి పట్టుబడ్డారన్నారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసు కొని తవ్వకాలకు ఉపయోగించిన సామగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ముగ్గురు నిందితులపై ఏపీ పారెస్టు యాక్ట్ 1957 ప్రకారం పలు సెక్షన్లపై కేసులు నమోదు చేశామన్నారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపర్చామన్నారు. క్వారీ వద్ద తవ్వకాలకు ఎవరు ప్రయత్నించినా కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ఈకార్యక్రమంలో పారెస్టు సెక్షన్ అధికారి పి. నూకరాజు, ఎస్టీవో డి. గోపి పాల్గొన్నారు.

# బయటకు రా... కేడర్ లో ఒక్కటే డిమాండ్

**విజయవాడ, అక్టోబరు 23, పెన్ పవర్:**
వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఎక్కువ సమయం బెంగళూరులోనే ఉంటున్నారు. ఇప్పటికే 2024 ఎన్నికల్లో ఓటమి పాలయి దాదాపు రెండేళ్లకు దగ్గరపడుతుంది. ఇప్పటికైనా బెంగళూరు వదిలి తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో నేతలకు, ముఖ్యమైన కార్యకర్తలకు అందుబాటులో ఉండాలన్న డిమాండ్ ఎక్కువగా వినపడుతుంది. నెలలో ఇరవై నాలుగు రోజులు బెంగళూరులోనే జగన్ ఉంటున్నారు. కేవలం ఆరు రోజులు మాత్రమే తాడేపల్లికి వస్తున్నారు. అదీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకో.. నేతలతో సమావేశమవ్వడానికో ఆయన వస్తున్నారు. కానీ ఇకపై లాభం లేదని, ఇప్పటికే సమయం మించి పోయిందని, కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదవుతున్నాయని, నేతలు కూడా బయటకు ఇంకా రావడం లేదని, దీనికి ప్రధాన కారణం జగన్ ఇక్కడ ఉండకపోవడమేనన్న అభిప్రాయం కార్యకర్తల్లో బలంగా కనిపిస్తుంది.. కానీ రాయలసీమలో అతి తక్కువ సార్లు మాత్రమే జగన్ పర్యటించారు. నిజానికి ఓటు బ్యాంకు, వైసీపీకి పట్టున్న రాయలసీమలోని నాలుగు జిల్లాల్లో పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు. రాయలసీమలో వైసీపీ నేతల మధ్య సఖ్యత కొరవడింది. ఇప్పటి నుంచే సీట్ల కోసం కొందరు ప్రయత్నిస్తున్నారు. మరికొందరు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. పటిష్టమైన క్యాడర్ ఉన్న రాయలసీమను అలా వదిలేస్తే రానున్న కాలంలో ఎలా అన్న ప్రశ్న వినపడుతుంది. జగన్ మాత్రం ఇంకా టైముందని చెబుతున్నారు. కానీ అప్పటికి నష్టం తీవ్రత మరింత పెరిగే



అవకాశముందన్న ఆందోళన పార్టీ నేతల్లో కనిపిస్తుంది. క్షేత్ర స్థాయిలో నాయకత్వం... నిజానికి ఇప్పటి వరకూ పార్టీకి క్షేత్రస్థాయిలో సరైన నాయకత్వం లేదన్నది వాస్తవం. నియోజకవర్గాల్లో బూత్ లెవెల్ కమిటీలను నియమించాలని కొద్దిరోజుల క్రితం జగన్ నేతలను ఆదేశించినప్పటికీ అవి కార్యరూపం దాల్చలేదు. చాలా నియోజకవర్గ ఇన్ ఛార్జుల విషయంలోనూ ఇంకా జగన్ నుంచి క్లారిటీ లేదు. గత ఎన్నికల్లో నియోజకవర్గాలను మార్చారు. అయితే అక్కడ గత ఎన్నికల్లో పోటీ చేసిన నేతలు వెళ్లడం లేదు. మరొకవైపు జోగి రమేష్ వంటి నేతలు తాము మైలవరంలో వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తామని ప్రకటించుకుంటున్నారు. ఇలాంటి సమయంలో జగన్ బయటకు వస్తేనే తప్ప ఈ సమస్యలకు తెరపడదు. కానీ ఆయన బెంగళూరు వదిలి రాకపోవడంతో క్యాడర్ కు అదే బెంగ పట్టుకుందంటున్నారు.

# విస్తరణం... కేబినెట్ లో ఎర్త్.. బెర్త్..

**విజయవాడ, అక్టోబరు 23, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ లో మంత్రి వర్గ విస్తరణకు సమయం దగ్గరపడినట్లుంది. ఇప్పటికే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు పదహారు నెలలు గడిచింది. అంటే మరో ఆరు నెలలు గడిస్తే రెండేళ్లు పూర్తవుతుంది. అయితే మంత్రి వర్గ విస్తరణ ఖచ్చితంగా ఉంటుందని పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం. ప్రస్తుతం ఉన్న మంత్రుల్లో అందరూ కొత్త వారే కావడంతో పాటు విపక్షానికి సరైన కౌంటర్ ఇవ్వడంలోనూ విఫలమవుతున్నారు. కొందరి మంత్రుల్లో సబ్జెక్ట్ పై అవగాహన కూడా లేదు. అనేక వివాదాలు ఈ పదహారు నెలల్లోనే చుట్టుముట్టాయి. చంద్రబాబు నాయుడు అంతా తాను ఒక్కడే అయి వ్యవహరించాల్సి వస్తుంది. జిల్లాలో కూటమి నేతల మధ్య తలెత్తిన విభేదాలను కూడా పరిష్కరించలేని పరిస్థితుల్లో ఉన్నారన్న అభిప్రాయంలో చంద్రబాబు ఉన్నారు.స్థానిక వ్యాపారాలు ప్రస్తుతం కూటమి ప్రభుత్వానికి పాజిటివ్ వేవ్స్ ఉన్నాయని చంద్రబాబు బలంగా నమ్ముతున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి సహకారం అందుతుండటంతో పాటు పెట్టుబడులు కూడా వస్తుండటంతో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. నిధుల కొరత ఉన్నా ఏ మాత్రం చెప్పింది చెప్పినట్లు లబ్దిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. అయినా మంత్రులు దానిని పెద్దగా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విఫలమయ్యారన్న అభిప్రాయంతో చంద్రబాబు ఉన్నారు. జిల్లాలను పర్యటించడంతో పాటు అక్కడ కూటమి నేతల మధ్య ఉన్న విభేదాలను పరిష్కరించడంలోనూ మంత్రులు వైఫల్యం చెందుతున్నారన్న బలమైన అభిప్రాయం చంద్రబాబులో ఏర్పడింది. అందుకే వచ్చే ఏడాదిలో మంత్రి వర్గ విస్తరణ చేపట్టాలని భావిస్తున్నట్లు తెలిసింది ఇప్పటికే మంత్రి వర్గ సమావేశాల్లో పలుమార్లు చంద్రబాబు నాయుడు మంత్రులను హెచ్చరించారు. అయినా కొందరిలో మార్పు రాకపోవడాన్ని గమనించారు. మంత్రులకు ఫైళ్ల క్లియరెన్స్ లోనూ, పనితీరులోనూ మార్కులు కూడా ఇచ్చారు. కానీ మంత్రుల్లో మార్పు కనిపించకపోవడంతో ఇక సమయం చాలని, ఎన్నికల టీంను సిద్ధం చేసుకోవాలని చంద్రబాబు సిద్ధమయినట్లు సమాచారం. ప్రస్తుతం మంత్రివర్గంలో ఒక పోస్టు ఖాళీగా ఉంది. జనసేనకు చెందిన ముగ్గురు మంత్రులున్నారు. బీజేపీకి చెందని ఒక మంత్రి ఉన్నారు. వాటితో సంబంధం లేకుండా మంత్రివర్గంలో పెద్దయెత్తున ప్రక్షాళన చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది.



ఈ సారి మాత్రం ఎన్నికల టీం కావడంతో సీనియర్లకు అవకాశం కల్పించే అవకాశాలే ఎక్కువ కనిపిస్తున్నాయి. దీంతో ప్రస్తుతం ఉన్న మంత్రుల్లో కొంత ఆందోళన బయలుదేరింది. ఎవరు ఉంటారో.. ఎవరికి ఉస్టింగ్ అనేది అన్న చర్చ జరుగుతుంది. ఇన్ -అవుట్ లపై కూడా పార్టీలో పెద్దయెత్తున ప్రచారం అయితే ఉంది.
ప్రస్తుతం క్యాబినెట్లో మంది మంత్రులు ఉన్నారు. అందులో జనసేనకు చెందిన ముగ్గురు, బిజెపి నుంచి ఒకరు, టిడిపి నుంచి 19 మంది ఉన్నారు. ఒక మంత్రి పదవి ఖాళీగా ఉంది. రాజ్యసభ పదవుల సర్దుబాటులో భాగంగా మెగా బ్రదర్ నాగబాబు కు అవకాశం చిక్కలేదు. దీంతో ఆయనను మంత్రివర్గంలోకి తీసుకుంటామని చంద్రబాబు ప్రకటించారు. అందుకు తగ్గట్టుగానే ఆయనను ఎమ్మెల్సీ చేశారు. త్వరలో మంత్రి పదవిలోకి తీసుకుంటారని ప్రచారం నడిచింది. కానీ మంత్రివర్గ విస్తరణ వరకు ఆయన వేచి ఉండక తప్పదు. ఎందుకంటే నాగబాబుకు ఇవ్వాలనుకుంటే ఒక మంత్రి పదవి ఖాళీ ఉంది. కానీ అలా చేయలేదు.ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో సంతృప్తి కనిపిస్తోంది. పాజిటివ్ వేవ్స్ సైతం ఉన్నాయని సర్వేల్లో తేలుతోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి సహకారం అందుతుండడంతో పెద్ద ఎత్తున రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయి. మరోవైపు సంక్షేమ పథకాలు కూడా అమలవుతున్నాయి. వైసిపి హయాంలో కేవలం సంక్షేమ పథకాలను మాత్రమే అమలు చేసేవారు. ఇప్పుడు సంక్షేమంతో పాటు అభివృద్ధిపై కూడా దృష్టి పెట్టింది కూటమి. అయితే ఇది ప్రభుత్వం పై సానుకూలంగా మారుతోంది. కానీ దీనిపై మంత్రులు ప్రచారం చేసుకోలేకపోతున్నారన్న విమర్శ ఉంది. పనితీరులో వెనుకబడి పోతున్నారన్న ప్రచారం ఉంది. అందుకే మంత్రివర్గ విస్తరణ ఉంటుందన్న టాక్ నడుస్తోంది. చంద్రబాబుఅనవసరంగా తేనె తుట్టను కదులుస్తారా? అన్న అనుమానాలు కూడా ఉన్నాయి. మంత్రి పదవుల కోసం కూటమిలోనే చాలామంది నేతలు ఎదురుచూస్తున్నారు. అందులో సీనియర్లు సైతం ఉన్నారు. శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు అటువంటి వారి జాబితా పదుల సంఖ్యలో ఉంది. ఇప్పుడు అనవసరంగా కెలికి మంత్రి పదవులు భర్తీ చేస్తారా అన్న అనుమానాలు కూడా ఉన్నాయి. అయితే కచ్చితంగా ప్రజలనుంచి సంతృప్తి స్థాయి ఉండడంతో.. పూర్తిగా ఎన్నికలను ఉద్దేశించి.. కొత్త టీం రంగంలోకి వస్తుందని ప్రచారం జరుగుతోంది. సీనియర్లతో పాటు జూనియర్లకు సైతం మంత్రివర్గంలో స్థానం ఉంటుందని కొత్త టాక్ అయితే తెరపైకి వచ్చింది. అందులో ఎంత వాస్తవం ఉందో తెలియాలి.

# పడక గదిలో సీసీ కెమెరాలు...

**తిరుపతి, అక్టోబరు 23, పెన్ పవర్:**
ఒక మనిషిని గెలవాలంటే నేరుగా తలపడాలి. యుద్ధక్షేత్రంలో ప్రత్యర్థిని ఓడించాలంటే ముందుగా మన సత్తా ఏమిటో చూపించాలి. అలాకాకుండా వెన్నుపోటు పొడిచి.. దొడ్డి దారి ప్రణాళికలు రూపొందిస్తే దానిని యుద్ధ రీతి అనరు. ఇటువంటి విధానాన్ని అమలు చేసిన ఓ రాజకీయ నాయకుడు ఇప్పుడు తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కొంటున్నాడు. విపరీతమైన విమర్శలను చవిచూస్తున్నాడు. తట్టుకోలేక రాష్ట్రానికి దూరంగా ఉంటున్నాడు.ఆ రాజకీయ నాయకుడికి బలమైన నేపథ్యం ఉంది. ఆయన తండ్రి మంత్రిగా కూడా పనిచేశారు. ప్రస్తుతం ఆ నాయకుడు ఎమ్మెల్యేగా పనిచేస్తున్నారు.. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ అధికారంలో ఉంది. ఆ నియోజకవర్గ ప్రజలు దీవించారు కాబట్టి ఆయన ఎమ్మెల్యే అయ్యారు. మరోసారి ఆయన గెలవాలంటే గొప్ప పనులు చేయాలి. ప్రజల మనసులో స్థిరమైన స్థానాన్ని సంపాదించుకోవాలి. అవసరమైతే తనకు శత్రుత్వం అనేది లేకుండా.. ప్రత్యర్థి అనే వ్యక్తి ఉండకుండా చూసుకోవాలి. ఇవన్నీ జరగాలంటే ముందుగా ఆ రాజకీయ నాయకుడిలో మంచితనం ఉండాలి. కానీ ఎమ్మెల్యే గా గెలిచిన ఆ నాయకుడిలో మంచితనం అనేది లేకుండా పోయింది. ముంచేతనం అనేది పెరిగిపోయింది. అన్నిటికంటే ముఖ్యంగా తనకు ప్రత్యర్థిగా ఉన్న ఒక మహిళపై పైశాచికత్వాన్ని ప్రదర్శించిన తీరు ఇప్పుడు ఆ రాష్ట్ర రాజకీయాల్లోనే సంచలనంగా మారింది.ఆమె ఉన్నత విద్యావంతురాలు. తన నియోజకవర్గానికి సేవ చేయడానికి రాజకీయాలలోకి వచ్చారు. అంతేకాదు సేవా కార్యక్రమాలు కూడా విస్తృతంగా చేశారు. డబ్బు కూడా భారీగా ఖర్చు పెట్టారు. ఆమె భర్త కూడా ఇందుకు సహకరించారు. అయితే ఆమెకే టికెట్ అనుకుంటున్న క్రమంలో.. ఊహించిన విధంగా పొత్తు ఏర్పడింది.. దీంతో ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ పొత్తు ధర్మంలో భాగంగా భాగస్వామ్య పార్టీకి సపోర్టు ఇవ్వాల్సి వచ్చింది. దీంతో ఆమెకు ఎమ్మెల్యే యోగ్యం దక్కలేదు. సరే తమతో పొత్తు కుదుర్చుకున్న పార్టీ తరఫున పోటీ చేసిన అభ్యర్థి ఎమ్మెల్యేగా గెలిచారని.. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చామని ఆమె గొప్పగా చెప్పుకుంది. అంతేకాదు అధికారంలోకి తమ పార్టీ భాగస్వామిగా ఉన్న సమూహం రావడంతో ఆనందపడింది. కానీ ఇక్కడే ఆమె ఆనందం ఆవిరైంది. దానికి ప్రధాన కారణం ఆ నియోజకవర్గంలోని ఎమ్మెల్యే నే.ఎమ్మెల్యే గెలిచిన తర్వాత ఆ నాయకుడి ప్రవర్తన పూర్తిగా మారిపోయింది. వచ్చే ఎన్నికల నాటికి తనకు రాజకీయ శత్రుత్వం ఉండకూడదని ఆయన భావించాడు. అందువల్లే తమ సమూహంలో ఉన్న పార్టీకి సంబంధించిన నాయకురాలికి అసలు రాజకీయ జీవితంలో లేకుండా చేయాలని అనుకున్నాడు. ఆమె దగ్గర పని చేస్తున్న ఒక వ్యక్తిని దగ్గరికి తీసుకున్నాడు. డబ్బు ఆశ చూపించాడు. అయితే ఆ నాయకురాలికి మరొక వ్యక్తితో సంబంధం ఉండేది. ఇదే అదునుగా భావించిన ఆ ఎమ్మెల్యే
ఆ నాయకురాలి వద్ద పనిచేస్తున్న వ్యక్తితో చేయకూడని కార్యక్రమాలు చేయించాడు. ఆ నాయకురాలు పడకగదిలో సీసీ కెమెరాలు పెట్టించాడు.. దీంతో ఆ నాయకురాలు తన ప్రియుడితో సాగించే సరసాలు అందులో రికార్డ్ అయ్యాయి. ఈ వీడియోలు మొత్తం కూడా ఆ వ్యక్తి సదరు ఎమ్మెల్యేకు పంపించాడు. ఆ వీడియోలను అడ్డం పెట్టుకొని సదరు నాయకురాలిని బెదిరించేందుకు
ఆ ఎమ్మెల్యే ప్రయత్నాలు మొదలు పెట్టాడు. కానీ ఇంతలోనే ఆ నాయకురాలు తన వద్ద పనిచేసే వ్యక్తి వీడియోలు పంపిస్తుండగా చూసింది.. ఆ తర్వాత ఈ విషయాన్ని తన భర్తకు వేరే విధంగా చెప్పింది. దీంతో ఆమె భర్త.. తన అనుచరులతో కలిసి ఓ ప్రణాళిక రూపొందించాడు. అంతేకాదు తమ వద్ద పనిచేస్తున్న ఆ వ్యక్తిని అంతం చేశాడు. ఈ వ్యవహారంలో అతడు ప్రస్తుతం జైల్లో ఉంటున్నాడు. ఆవుల మంద పోట్లాడుకుంటే దూడల కాళ్ళు విరిగినట్టు.. ఎమ్మెల్యే, ఓ నాయకురాలు మధ్య ఏర్పడిన వివాదం చివరికి ఒక మనిషి ప్రాణం పోవడానికి కారణమైంది. అతని కుటుంబాన్ని దిక్కులేని వాళ్ళను చేసింది. అందుకే సాధ్యమైనంతవరకు పెద్దల వ్యవహారాలలో వేలు పెట్టకపోవడమే మంచిది.


## కిషాన్ దారెటు: ఇషాన్ కోసం ముంబై ఎదురుచూపులు..
# ట్రేడింగ్‌లో ఆసక్తి చూపిస్తున్న మరో రెండు జట్లు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్ ప్లేయర్ల వేలానికి ఇంకా చాలా సమయం ఉన్నా తమకు నచ్చిన ఆటగాళ్లను జట్టులోకి తీసుకునేందుకు ఫ్రాంచైజీలు తెరవెనుక ప్రయత్నాలు చేస్తున్నాయి. ప్లేయర్ల ట్రేడింగ్ విండో ఓపెన్ అవడంతో ఫ్రాంఛైజీలు ఆటగాళ్ల బదిలీ కోసం చర్చలు మొదలుపెట్టాయి. ఈ ట్రేడ్ మార్కెట్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ డ్యాషింగ్ వికెట్ కీపర్ - బ్యాటర్ ఇషాన్ కిషన్ అత్యంత డిమాండ్‌లో ఉన్న ఆటగాడిగా నిలిచాడు. ఇషాన్ కిషన్‌ను తిరిగి తమ జట్టులోకి తీసుకురావడానికి ఐదుసార్లు చాంపియన్ అయిన ముంబై ఇండియన్స్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

ముంబైతో పాటు పాటు కేకేఆర్, రాజస్తాన్ రాయల్స్ కూడా సన్ రైజర్స్‌ను సంప్రదించినట్టు తెలుస్తోంది. అయితే, ప్రస్తుతానికి ట్రేడ్ విషయంలో సన్‌రైజర్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ మూడు జట్లూ తమ టాపార్డర్‌లో వికెట్ కీపర్-బ్యాటర్ కోసం చూస్తున్నాయి. ముంబై టీమ్‌కు నాణ్యమైన ఇండియా వికెట్ కీపర్-%-%బ్యాటర్ చాలా అవసరం. ఇషాన్ రాకతో ముంబై తుది జట్టులో మరో ఫారిన్ ప్లేయర్‌ను తీసుకునే అవకాశం దక్కుతుంది. అంతేకాక హార్దిక్ పాండ్యా తర్వాత జట్టు పగ్గాలు చేపట్టడానికి టాపార్డర్‌లో సుదీర్ఘకాలం ఉండే ఓ యంగ్ ఇండియన్‌గా ఇషాన్ సరిగ్గా సరిపోతాడని ముంబై భావిస్తోంది. కేకేఆర్ జట్టుకు ఫారిన్ కీపర్లు ఆశించిన ఫలితాలు ఇవ్వకపోవడం, రాయల్స్ టీమ్‌లో సంజు శాంసన్ భవిష్యత్తుపై ఉన్న సందిగ్ధత వంటి కారణాల వల్ల కిషన్ ఆ ఫ్రాంచైజీలకూ కీలక టార్గెట్‌గా మారాడు. ఈ ట్రేడ్ రేసులో ముంబై ముందంజలో ఉన్నప్పటికీ, మిగతా ఫ్రాంఛైజీల నుంచి కూడా గట్టి పోటీ ఎదురవుతోంది. అయితే, గత సీజన్ వేలంలో రూ.11.25 కోట్లకు కొనుగోలు చేసిన ఇషాన్ కిషన్‌ను వదులుకోవడానికి సన్‌రైజర్స్ సుముఖంగా లేదని ప్రాథమిక చర్చల ద్వారా తెలుస్తోంది. అయినప్పటికీ, ట్రేడ్ డీల్ అనేది పూర్తిగా ముంబై, హైదరాబాద్ మధ్య జరిగే చర్చలు, ఆటగాడి తుది నిర్ణయంపై ఆధారపడి ఉండనుంది. ఇక, ఐపీఎల్ మినీ-వేలానికి ముందు అన్ని ఫ్రాంఛైజీలు తమ రిటెన్షన్ జాబితాలను నవంబర్ 15లోగా సమర్పించాల్సి ఉంటుంది. ఈ గడువులోగా ఇషాన్ కిషన్ ట్రేడ్ డీల్ కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

# సరిపోని పోరాటం: అడిలైడ్ వన్డేలోనూ ఓడిన టీమిండియా.. సిరీస్ ఆస్ట్రేలియా కైవసం





**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియాతో ముగిసిన రెండో వన్డేలో టీమిండియా ఓడిపోయింది. ఒక మాదిరి ఛేజింగ్ లో ఆసీస్ థ్రిల్లింగ్ విక్టరీ కొట్టింది. గురువారం (అక్టోబర్ 23) అడిలైడ్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్ లో ఆస్ట్రేలియా 2 వికెట్ల తేడాతో భారత జట్టుపై విజయం సాధించింది. షార్ట్ (74) తో పాటు కొనొల్లి (61), మిచెల్ ఓవెన్ (36) బ్యాట్ ఝుళిపించడంతో ఆసీస్ ఉత్కంఠ విజయాన్ని అందుకుంది. ఈ విజయంతో ఆస్ట్రేలియా మూడు మ్యాచ్ ల వన్డే సిరీస్ ను ఒక మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0 తేడాతో కైవసం చేసుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన ఇండియా నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 264 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో ఆస్ట్రేలియా 46.2 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 265 పరుగులు చేసి గెలిచింది.

265 పరుగుల టార్గెట్ తో బరిలోకి దిగిన ఆస్ట్రేలియాకు ఆరంభంలో పరుగులు చేయడానికి ఇబ్బంది పడింది. టీమిండియా బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో స్కోర్ నత్తనడకన సాగింది. క్రీజ్ లో ఉన్నంత వరకు ఇబ్బందిపడిన కెప్టెన్ మార్ష్ (11)ను అర్షదీప్ సింగ్ ఔట్ చేశాడు. కాసేపటికే ట్రావిస్ హెడ్ (28)ను హర్షిత్ రానా పెవిలియన్ కు పంపాడు. దీంతో 54 పరుగులకే ఆస్ట్రేలియా తమ ఓపెనర్లను కోల్పోయింది. ఈ దశలో ఆసీస్ ను రెన్ షా, షార్ట్ ఆదుకున్నారు. జాగ్రత్తగా ఆడుతూ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. మూడో వికెట్ కు 55 పరుగులు జోడించి పరిస్థితిని కాస్త చక్కదిద్దారు. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని అక్షర్ పటేల్ విడగొట్టాడు. ఒక అద్భుతమైన బంతికి రెన్ షా (30) ను బౌల్డ్ చేశాడు. వికెట్ కీపర్ క్యారీని సుందర్ బౌల్డ్ చేయడంతో ఆస్ట్రేలియా 134 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడినట్టు అనిపించింది. ఈ సమయంలో షార్ట్ కు జత కలిసిన కొనొల్లి జాగ్రత్తగా ఆడుతూ ఇన్నింగ్ ను ముందుకు తీసుకెళ్లారు. ఆరంభంలో ఇబ్బందిపడిన ఈ జోడీ ఆ తర్వాత స్వేచ్ఛగా బ్యాట్ ఝులిపించారు. ఐదో వికెట్ కు 55 పరుగులు జోడించి ఇండియాను కంగారు పెట్టారు. కరెక్ట్ టైమ్ లో హర్షిత్ రానా టీమిండియాకు వికెట్ అందించాడు. ఒక షార్ట్ బాల్ తో హాఫ్ సెంచరీ చేసి ఊపు మీదున్న షార్ట్ (74) ను ఔట్ చేశాడు. మ్యాచ్ ఆసక్తికరంగా మారిందన్న సమయంలో కొనొల్లి, ఓవెన్ భారీ షాట్లతో చెలరేగి ఆసీస్ కు విజయాన్ని అందించారు. ఇండియా బౌలర్లలో హర్షిత్ రానా, రెండు వికెట్లు పడగొట్టాడు. సుందర్, అక్షర్ పటేల్, అర్షదీప్ సింగ్ తలో వికెట్ తీసుకున్నారు. సుందర్, సిరాజ్ లకు తలో వికెట్ దక్కింది. ఇరు జట్ల మధ్య మూడో వన్డే శనివారం (అక్టోబర్ 25) సిడ్నీ వేదికగా జరుగుతుంది.

**రోహిత్, అయ్యర్ హాఫ్ సెంచరీలు:**

టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ఇండియాకు మంచి ఆరంభం లభించలేదు. ఆరంభంలో ఆసీస్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో పరుగులు రాలేదు. ఇన్నింగ్స్ ఏడో ఓవర్లో బార్ట్ లెట్ టీమిండియాకు డబుల్ స్ట్రోక్ ఇచ్చాడు. ఇన్నింగ్స్ ఏడో ఓవర్ తొలి బంతికి 9 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద గిల్ లాంగాఫ్ లో బౌండరీ కొట్టడానికి ప్రయత్నించి మార్ష్ కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. అదే ఓవర్ ఏడో ఓవర్ ఐదో బంతికి బార్ట్ లెట్ వేసిన అద్భుతమైన ఇన్ స్వింగ్ ధాటికి ఎల్బీడబ్ల్యూ రూపంలో విరాట్ కోహ్లీ వెనుదిరిగాడు. దీంతో ఇండియా తొలి 10 ఓవర్లు ముగిసేసరికి 2 వికెట్ల నష్టానికి 29 పరుగులు మాత్రమే చేయగలిగింది.

వరుసగా రెండు వికెట్లు పడడంతో ఇండియా ఒత్తిడిలో పడింది. ఈ దశలో ఆసీస్ బౌలర్లు టీమిండియాపై మరింత ఒత్తిడి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. దీంతో రోహిత్, అయ్యర్ పరుగులు చేయడానికి తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. తొలి ఓవర్లలో ఇండియా కేవలం 29 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఆ తర్వాత ఒక్కసారిగా మన బ్యాటర్లు బ్యాట్ కు పని చెప్పారు. వరుస బౌండరీలతో హోరెత్తించారు.

మిచ్లే ఓవెన్ బౌలింగ్ లో రోహిత్ శర్మ మూడు బంతుల వ్యవధిలో రెండు సిక్సర్లు బాది ఆధిపత్యం చూపించాడు. ఈ క్రమంలో ఇద్దరూ తమ హాఫ్ సెంచరీలు పూర్తి చేసుకున్నారు.

భారీ స్కోర్ ఖాయమనుకుంటే ఆస్ట్రేలియా మరోసారి పుంజుకుంది. స్వల్ప వ్యవధిలో రోహిత్ శర్మ (73), శ్రేయాస్ అయ్యర్ (61), కేఎల్ రాహుల్ (11) వికెట్లు పడగొట్టి మరోసారి ఇండియాను కష్టాల్లో పడేసింది. స్టార్క్ రోహిత్ ను ఔట్ చేస్తే.. ఆ తర్వాత జంపా తన స్పిన్ మ్యాజిక్ తో అయ్యర్, రాహుల్ ను బౌల్డ్ చేశాడు. ఈ దశలో అక్షర్ పటేల్, వాషింగ్ టన్ ఆరో వికెట్ కు 39 పరుగులు జోడించి పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. క్రీజ్ లో ఉన్నంతవరకు అద్భుతంగా ఆడిన అక్షర్ స్టార్క్ పట్టిన ఒక స్టన్నింగ్ క్యాచ్ కు పెవిలియన్ కు చేరాడు. చివర్లో హర్షిత్ రానా, అర్షదీప్ సింగ్ వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడుతూ జట్టు స్కోర్ ను 250 పరుగులు దాటించారు. ఆస్ట్రేలియా బౌలర్లలో జంపా నాలుగు వికెట్లు పడగొట్టాడు. బార్ట్ లెట్ మూడు.. స్టార్క్ రెండు వికెట్లు పడగొట్టారు.

# 2026 మిడ్ లో తారక్-త్రివిక్రమ్ !







అన్ని అనుకున్నట్లు జరిగితే యంగ్ టైగర్ ఎన్టీఆర్ కథానాయకుడిగా త్రివిక్రమ్ ప్రాజెక్ట్ పట్టాలెక్కాలి. కానీ ఇండస్ట్రీలో లెక్కలు మారుతాయి గా. అదే లెక్క ఈ కాంబినేషన్ లోనూ మారింది. అనూహ్యంగా తారక్ తో ప్రశాంత్ నీల్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ పట్టాలెక్కించడంతో? సీన్ మొత్తం మారింది. త్రివిక్రమ్ తెరకెక్కించాల్సిన మైథలాజికల్ చిత్రం వాయిదా పడింది. దీంతో గురూజీ ఈ గ్యాప్ లో విక్టరీ వెంకటేష్ తో సినిమా చేస్తున్నాడు. ఈ సినిమా ఇప్పటికే ప్రారంభమైన సంగతి తెలిసిందే. రెగ్యులర్ షూటింగ్ కూడా మొదలైంది. -డ్రాగన్ -

**ఓ కొలిక్కి వచ్చిన తర్వాత:**

ఈ సినిమా అన్ని పనులు పూర్తి చేసుకుని వచ్చే ఏడాది మిడ్ కల్లా రిలీజ్ కానుందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తారక్-గురూజీ ప్రాజెక్ట్ ఎప్పుడు మొదలవుతుంది? అన్నది లీక్ అయింది. వెంకీ ప్రాజెక్ట్ పూర్తయిన వెంటనే గురూజీ తో తారక్ సినిమా కూడా మొదలవుతుందన్నది తాజా సమాచారం. %-%డ్రాగన్ - అప్పటికీ షూటింగ్ సహా పోస్ట్ ప్రొడక్షన్ కూడా ముగింపు దశకే చేరుకుంటుంది. రిలీజ్ అయినా అవ్వకపోయినా? ఆ సినిమా రిలీజ్ తో సంబంధం లేకుండా గురూజీ సినిమాకు తారక్ డేట్లు కేటాయించాలని డిసైడ్ అయ్యాడని ఆయన సన్నిహిత వర్గాల నుంచి తెలిసింది.

**ఇప్పటికే మొదలైన ప్రిపరేషన్:**

మైథలాజికల్ కాన్సెప్ట్ కావడంతో? ఈ సినిమా కు కూడా తారక్ ఎక్కువగా డేట్లు కేటాయించాల్సి వస్తోందిట. ఈ సిని మా షూటింగ్ ఓ కొలిక్కి వచ్చే వరకూ మరో సినిమా మొదలు పెట్ట కూడాదని తారక్ కూడా స్ట్రాంగ్ గా ఉన్నాడుట. గురూజీ సినిమాకు సంబంధించి తారక్ ఇప్పటికే సన్నధం అవ్వడం మొదలు పెట్టాడు. %-%డ్రాగన్%-% షూటింగ్ తో సంబంధం లేకుండా పాత్ర పరంగా సిద్దమవ్వడం కోసం గురూజీ ఇచ్చిన పుస్తకాలు చదువుతోన్న సంగతి తెలిసిందే. పాత్రలో ఆత్మను పట్టుకునే ప్రక్రియలో భాగంగా తారక్ ముందొస్తు ప్రిపరేషన్ కనిపిస్తోంది.

**గురూజీ నుంచి మినహాయింపు ఉంటుందా:**

పాత్ర లుక్ పరంగా ఎలాంటి ట్రాన్సపర్మేషన్ అవసరం అవుతుంది? అన్నది జనవరి ముగింపు కల్లా గురూజీ సూచిస్తాడని వినిపిస్తోంది. మరి త్రివిక్రమ్ సిద్దం చేస్తన్న ప్రణాళిక పక్కాగా అమలవుతుందా? మధ్యలో ఏవైనా డిస్టబెన్సెస్ ఎదురవుతాయా? అన్నది అప్పటి సందర్భాన్ని బట్టి కనిపిస్తుంది. %-%డ్రాగన్%-% కోసం తారక్ లుక్ ఇప్పటికే మారిన సంగతి తెలిసిందే. బాగా సన్నమయ్యాడు. భారీ యాక్షన్ చిత్రం కావడంతో? అదనంగా శ్రమించాల్సి వస్తోంది. మరి ఇలాంటి కసరత్తుల నుంచి గురూజీ మనిహాయింపు ఇస్తాడా? ఆయనా సానబెడతాడా? అన్నది చూడాలి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at Nagendla venkateswarlu, Door no:7-1-107, station road, Narasaraopet, Palnadu District Andhrapradesh- 522601 Editor : GANTYADA APPARAO Mobile : 9059465965, RNI : APTEL/25/A2292, editorpenpower@gmail.com